www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

సంపుటి - 4 సంచిక -131 మంగళవారం 25 ఆగస్టు 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా వినికిడి
తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
8978701613,7013016545

## తెలంగాణ ప్రజలను కేంద్రం

# అవమానించింది

**అమెరికా పర్యటనకు అనుమతిపై రేవంత్ తీవ్ర ఆగ్రహం**

**ఇది ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని వ్యాఖ్య**

**విదేశాల్లో స్పందిస్తే దేశద్రోహి అనేవారని వెల్లడి**

**అమెరికాకు తెలంగాణ అధికారులను పంపినట్లు ప్రకటన**

**ఆక్స్‌ఫర్డ్‌తో తెలంగాణ ఒప్పందం చేసుకోనుందని వెల్లడి**




**హైదరాబాద్,ఆగస్టు 24(ప్రజావినికడి):** అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడంపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది తనకు జరిగిన అవమానం కాదని.. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానమని అన్నారు. కేంద్రం తీరు ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని విమర్శించారు. బ్రిటన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. **2లో...**




## స్వదేశీ విత్తనాలకే

# ప్రాధాన్యం ఇవ్వాలి

**ఏలూరు జిల్లా ముసునూరులో కొత్త మొక్కజొన్న వంగడం ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి**



**ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రశంసలు**

**రాష్ట్ర ప్రగతిని కాంక్షించే జాతీయవాది అంటూ కితాబు**


**రైతులే దేశానికి వెన్నెముక అని స్పష్టం చేసిన రాధాకృష్ణన్**

**ఒక రైతు విజయాన్ని ఉదాహరణగా చూపుతూ తన అనుభవాన్ని పంచుకున్న వైనం**

**ఏలూరు ఆగస్టు 24.(ప్రజావినికడి):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక నిజమైన జాతీయవాది అని, అదే సమయంలో రాష్ట్ర అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తారని భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ కొనియాడారు. ఆయన జాతీయవాదం రాష్ట్ర ప్రగతికి ఏమాత్రం అడ్డురాదని, ఇదే ఆయనలోని గొప్పతనమని ప్రశంసించారు**మిగతా 2లో...**

## కళ్యాణ లక్ష్మి కేసులో ప్రభుత్వానికి స్వల్ప ఊరట

**దివ్యాంగ వధువులకు సాయాం కొనసాగించాలని హైకోర్టు ఆదేశం**




**హైదరాబాద్,ఆగస్టు 24(ప్రజావినికడి):** తెలంగాణ హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి స్వల్ప ఊరట లభించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద దివ్యాంగ వధువులకు అందిస్తున్న అదనపు సాయాన్ని కొనసాగించేందుకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో వీరికి **మిగతా 2లో...**

## శాసనసభ కమిటీలకు

# ఎంతో ప్రాధాన్యం

**ఆయా వర్గాల అభివృద్ధికి కమిటీలు కృషి చేయాలి**

**బడ్జెట్ కేటాయింపులు సమీక్షించుకోవాలి**

**శాసనమండలి కమిటీల సమావేశంలో గుత్తా, గడ్డం ప్రసాద్**

**హైదరాబాద్,ఆగస్టు 24.(ప్రజావినికడి):** ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ కమిటీలకు ఎంతో ప్రాధాన్యత ఉన్నదని,ప్రభుత్వ శాఖల పనితీరును సమీక్షిస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలు సమర్థవంతంగా చేరేలా చూడడంలో కమిటీలు కీలక పాత్ర పోషిస్తాయని చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై కమిటీలు నిత్యం మానిటరింగ్ చేస్తూ, ప్రభుత్వానికి సలహాలు సూచనలు అందించాలన్నారు. మైనారిటీల విద్య, ఉపాధి, ఆరోగ్యం, సామాజిక **మిగతా 2లో...**



## ఫేక్ సమాచారాన్ని వ్యాప్తి చేస్తే కఠిన సైబర్ చర్యలు

**ఏపీలో స్థానిక ఎన్నికలంటూ ప్రచారం.. ఎస్ఈసీ హెచ్చరిక**

**సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న స్థానిక ఎన్నికల షెడ్యూల్ ఫేక్ అని వెల్లడి**

**అధికారిక ప్రకటనలను మాత్రమే నమ్మాలని ప్రజలకు ఎన్నికల సంఘం సూచన**

**100 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నాహాలు ప్రారంభం**

**కొత్తగా 33.33 శాతం బీసీ రిజర్వేషన్ల ప్రతిపాదన**

**ఆగస్టు 24.(ప్రజావినికడి):** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ అంటూ సోషల్ మీడియా, వాట్సాప్‌లలో విస్తృతంగా ప్రచారమవుతున్న సమాచారం పూర్తిగా అవాస్తవమని, నకిలీదని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు. ఈ ఫేక్ షెడ్యూల్‌ను ప్రజలు నమ్మవద్దని, ఇతరులకు ఫార్వార్డ్ చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి తప్పుడు వార్తలను వ్యాప్తి చేసే వారిపై కఠినమైన సైబర్ చట్టాల కింద చర్యలు తీసుకుంటామని **మిగతా 2లో...**






2లో.

# ఫీజు బకాయిల రగడ..

**హైదరాబాద్‌లో బీజేపీ నేత రాంచందర్ రావు 48 గంటల దీక్ష**

**రూ. 15,000 కోట్ల బకాయిలతో 40 లక్షల విద్యార్థులకు నష్టమని ఆరోపణ**

**రాంచందర్ రావుది రాజకీయ డ్రామా అని కొట్టిపారేసిన మంత్రి పొన్నం**

## తెలంగాణలో నేడు పాలిటెక్నిక్ కాలేజీల బంద్

**జీవో 97ను వ్యతిరేకిస్తూ ఏబీవీపీ ఆందోళన**

**రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ కాలేజీల బంద్‌కు పిలుపు**

**జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్**




**హైదరాబాద్,ఆగస్టు 24.(ప్రజావినికడి):** తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 97పై అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఈ జీవోను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, నేడు (మంగళవారం) రాష్ట్రవ్యాప్త పాలిటెక్నిక్ కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చింది. పాలిటెక్నిక్ కళాశాలలను **మిగతా 2లో...**

## పవన్ కళ్యాణ్ చొరవతో

# తీరుతున్న పులివెందుల దాహార్తి

**పులివెందుల తాగునీటి పథకానికి పునరుజ్జీవం**

**జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధారల కింద సుమారు రూ. 280 కోట్ల కేటాయింపులు**

**‹96 శాతం ఓవరాల్ ప్రాజెక్టు పనులు.. 99 శాతం పైప్‌లైన్ నిర్మాణం పూర్తి**

**తుది అంకానికి నీటి శుద్ధి ప్లాంట్ పనులు**

**పులివెందుల పట్టణం, గ్రామీణం, సింహాద్రిపురం మండలాల్లో 100 శాతం పూర్తయిన పనులు**

**లింగాల మండల పరిధిలో 24 ఆవాసాలకు తాగునీటి సరఫరా**

2లో.



# స్వదేశీ విత్తనాలకే ప్రాధాన్యం ఇవ్వాలి

**మొదటిపేజీ తరువాయి**

ఏలూరు జిల్లా ముసునూరులో జరిగిన నాన్-జీఎంఓ హై ఎక్స్‌పాన్షన్ పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తన ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ చంద్రబాబు పాలనా దక్షతపై ప్రశంసల జల్లు కురిపించారు. ముసునూరు గ్రామాన్ని ఒక విజయగాథగా తీర్చిదిద్దినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం తనకు వ్యక్తిగతంగా ఎంతో ప్రత్యేకమైందని, ఎందుకంటే ఇది భారతీయ రైతుల పురోగతికి సంబంధించినదని ఉపరాష్ట్రపతి అన్నారు. తన ప్రసంగంలో ఒక ఆసక్తికరమైన అనుభవాన్ని పంచుకున్నారు. "రెండు నెలల క్రితం 'దినమలర్' అనే తమిళ పత్రికలో మొక్కజొన్న పరిశ్రమలో పారిశ్రామికవేత్త పట్టాభి రామారావు సాధించిన అసాధారణ విజయాల గురించి చదివాను. ఒకే ఒక్క వ్యవసాయ ఉత్పత్తిని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన ఆయన స్ఫూర్తిదాయక ప్రస్థానం నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. వెంటనే ఆయనకు అభినందనలు తెలుపుతూ ఒక లేఖ రాశాను" అని వివరించారు. ఆ తర్వాత పట్టాభి రామారావు తనను కలిసి పాప్‌కార్న్‌ను బహుకరించారని గుర్తుచేసుకున్నారు.




ఈ ఘటన తర్వాత జరిగిన ఒక యాదృచ్ఛిక సంఘటనను ఉపరాష్ట్రపతి సభతో పంచుకున్నారు. కొద్దిరోజులకే ఉపరాష్ట్రపతి భవన్‌లో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో సమావేశం జరిగిందని, ఆ సమావేశంలో పట్టాభి ఇచ్చిన పాప్‌కార్న్‌ను అందరికీ అందించానని తెలిపారు. ఒక భారతీయ రైతు వ్యవస్థాపక శక్తిని, ఆయన పండించిన ఉత్పత్తి సత్తాను చాటిచెప్పడానికే ఈ ఉదాహరణను చెబుతున్నానని రాధాకృష్ణన్ అన్నారు.

రైతులే ఈ దేశానికి వెన్నెముక అని ఆయన పునరుద్ఘాటించారు. జీడీపీ, అభివృద్ధి గురించి మనం మాట్లాడక ముందే తరతరాలుగా ఈ నాగరికతకు అన్నం పెట్టింది రైతేనని అన్నారు. "మన పండుగలు, పంచాంగాలు, కాలగమన భావన సైతం విత్తనం వేయడం నుంచి పంట కోయడం వరకు సాగిన వ్యవసాయ చక్రం ఆధారంగానే రూపుదిద్దుకున్నాయి. జనవరి 14న దేశమంతటా ఆంధ్రప్రదేశ్‌లో మకర సంక్రాంతి, పంజాబ్‌లో లోహ్రీ, తమిళనాడులో పొంగల్, అసోంలో బిహు అంటూ పంటల పండుగను జరుపుకుంటాం. ఇంతటి వైవిధ్యభరితమైన మన దేశాన్ని వ్యవసాయం ఏకం చేస్తోంది" అని ఆయన వివరించారు. ప్రస్తుత ధరల ప్రకారం దేశ స్థూల విలువ జోడింపులో వ్యవసాయం, అనుబంధ రంగాల వాటా దాదాపు ఐదో వంతు ఉందని గుర్తుచేశారు.

ఈ కార్యక్రమంలో ఏపీ గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, కోర్టెవా పాప్‌కార్న్‌కా ఎండీ ఎస్పీబీ పట్టాభి రామారావు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి, ముఖ్యమంత్రి కలిసి కొత్త వంగడాన్ని ఆవిష్కరించి, పలువురు రైతులను సత్కరించారు.

# శాసనసభ కమిటీలకు ఎంతో ప్రాధాన్యం

**మొదటిపేజీ తరువాయి**

సంక్షేమం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలు, నిజమైన ప్రయోజనాలను అందించేలా చూడాల్సిన బాధ్యత ఈ కమిటీపై ఉన్నదన్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటనలతో పాటుగా, అధికారుల ద్వారా తగు సమాచారాన్ని తెప్పించుకుని షెడ్యూల్ కులాలకు సంబంధించిన పథకాల అమలులో లోటుపాట్లను సమీక్షించి ప్రభుత్వానికి తగు సూచనలు చేయాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కు అనుగుణంగా ఖర్చుపై సమగ్రంగా వివరణలను తీసుకోవాలన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ...తాను కూడా 2008 లో షెడ్యూల్ కులాల కమిటీ చైర్మన్ గా బాధ్యతలు నిర్వహించాననన్నారు. తెలంగాణ ఎప్పటినుంచో 'గంగా- జమున తెహజీబ్'కు ఒక గొప్ప ప్రతీకగా నిలుస్తోంది. హిందువులు, ముస్లిములు, క్రిష్టియన్లు మరియు ఇతర మైనారిటీ సోదరులు తరతరాలుగా ఒకే కుటుంబ సభ్యుల్లా కలిసి జీవిస్తూ, పండుగలు, భాషలు, ఆహారం, సంస్కృతులను పంచుకుంటూ, అన్నింటికంటే ముఖ్యంగా ప్రేమ, విశ్వాసాలతో ముందుకు సాగుతున్నారన్నారు. రాష్ట్ర జనాభాలో 18 శాతం ఉన్న షెడ్యూల్ కులాల జనాభా ఉన్నారు. ఈ కమిటీ షెడ్యూల్ కులాల అభ్యున్నతి, సంక్షేమం కొరకు పనిచేస్తూ వారి ప్రాథమిక అవసరాలను గుర్తించి, అందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. కమిటీ సభ్యులు తమ అనుభవం, అవగాహనతో అధికారులతో కలిసికట్టుగా పనిచేసి ప్రజాప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి, మైనారిటీలు, వెనుకబడిన తరగతుల అభివృద్ధికి కృషి చేస్తారని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్ లో శాసనమండలి మైనారిటీల సంక్షేమ కమిటీ,షెడ్యూల్ కులాల సంక్షేమ కమిటీ సమావేశమయ్యింది. శాసన పరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ , డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ లు హాజరయ్యారు. మైనారిటీస్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ తోట లక్ష్మీకాంతా రావు, సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్, పాయల్ శంకర్ కూడా హాజరయ్యారు. శాసనమండలి ఃూఅ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ మేడిపల్లి సత్యం , సభ్యులు వెడ్మ బొజ్జు, కేఆర్ నాగరాజు, కవ్వంపల్లి సత్యనారాయణ, విజయుడు, శ్రీపాల్ రెడ్డి, బస్వరాజు సారయ్యలు, శాసన పరిషత్ కార్యదర్శి డా. వి నరసింహా చార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతిలు కూడా హాజరయ్యారు. ముందుగా నూతన కమిటీ చైర్మన్లకు, సభ్యులకు పుష్ప గుచ్ఛాలతో చైర్మన్, స్పీకర్, మరియు సెక్రటరీలు అభినందనలు తెలిపారు.

# పవన్ కళ్యాణ్ చొరవతో తీరుతున్న పులివెందుల దాహార్తి

**కడపఆగస్టు 24(ప్రజావినికడి):**

జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధార కింద రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన తాగునీటి ప్రాజెక్టులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పారదర్శకంగా, రాజకీయాలకు అతీతంగా ముందుకు తీసుకువెళ్తున్నారు. గత ప్రభుత్వంలో ప్రారంభించి నిర్లక్ష్యం చేసిన పథకాలకు సైతం ప్రత్యేక ప్రాధాన్యమిచ్చి ముందుకు తీసుకువెళు న్నారు. వైఎస్సార్ కడప జిల్లా, పులివెందుల నియోజకవర్గంతోపాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చేపట్టిన మెగా వాటర్ గ్రిడ్ పథకం నిర్మాణ పనులు త్వరతగతిన పూర్తి చేసేందుకు పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో చర్యలు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన పనులను తిరిగి గాడిలో పెట్టి వేగవంతంగా పూర్తి చేసేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. దాదాపు రూ. 426 కోట్ల విలువైన 96 శాతం పనులు పూర్తి చేసి నిబద్ధత చాటుకున్నారు.

ఏడు మండలాల పరిధిలో ఐదున్నర లక్షల మంది ప్రజల దాహార్తి తీర్చే లక్ష్యంతో రూ. 480 కోట్ల అంచనా వ్యయంతో జల్ జీవన్ మిషన్ కింద ప్రారంభమైన పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పథకం పనులు గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు సమృద్ధిగా ఉన్నప్పటికీ పనులను ముందుకు తీసుకువెళ్లే అంశంలో శ్రద్ధ



చూపలేదు. చేపట్టిన పనుల్లో కడా నాణ్యత లేదు. కటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జల్ జీవన్ మిషన్ పనుల మీద జరిగిన తొలి సమీక్షలోనే పవన్ కళ్యాణ్ గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన పథకాలను సైతం ప్రాధాన్య క్రమంలో ముందుకు తీసుకువెళ్లాలని అధికారులకు సూచించారు. 2024లో కటమి ప్రభుత్వం అధికారం చేపట్టేనాటికి జల్ జీవన్ మిషన్ గడువు కడా పూర్తి కావడంతో, కేంద్రం వద్ద ఉన్న మిగులు నిధులు ఖర్చు చేసేందుకు వీలు లేకుండా పోయింది. ఉప ముఖ్యమంత్రివర్యులు, కటమి నాయకులు చేసిన ప్రయత్నాల ఫలంగా జల్ జీవన్ మిషన్‌ను మరో 4 ఏళ్ల పాటు పొడిగించేందుకు కేంద్రం అంగీకారం తెలపడంతో పులివెందుల మెగా తాగునీటి సరఫరా పథకం తిరిగి ఊపిరి పోసుకుంది.

అప్పటి నుంచి పవన్ కళ్యాణ్ గారి ప్రత్యేక చొరవతో దాదాపు రూ. 280 కోట్లు ఒక్క పులివెందుల పథకానికే కేటాయించి వేగంగా పనులు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో అరకొర పైప్‌లైన్లు వేయడం మినహా పెద్దగా పనులేమీ పూర్తి కాలేదు. కటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత 96 శాతం పనులు పూర్తి చేశారు. అందులో పులివెందుల, సింహాద్రిపురం మండలాలకు ఇప్పటికే ఈ పథకం ద్వారా తాగునీరు అందుతోంది. పులివెందుల పట్టణానికి సంబంధించిన పనులు కడా 100 శాతం పూర్తయ్యాయి. లింగాల మండలం పరిధిలో 27 ఆవాసాలకు గాను 24 ఆవాసాలకు త్వరలో తాగునీరు అందుతోంది. వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులో కీలకమైన ఇంటేక్ వెల్ పునరుద్ధరణ పనులు పూర్తి కాగా, 65 మిలియన్ లీటర్ల నీటి శుద్ధి ప్లాంట్లు కడా అందుబాటులోకి వచ్చాయి. 1,111 కిలోమీటర్ల పైప్‌లైన్‌కు గాను 1,106 కిలోమీటర్ల నిర్మాణం పూర్తయ్యింది. ఓవర్‌హెడ్ ట్యాంకులు, గ్రౌండ్ లెవల్ రిజర్వాయర్ల నిర్మాణం కడా దాదాపు తుది దశకు చేరింది. కటమి ప్రభుత్వం తాగు నీరు వంటి ప్రజల ప్రాథమిక అవసరాలు తీర్చేందుకు రాజకీయాలకు అతీతంగా ముందుకు వెళ్లాలని పవన్ కళ్యాణ్ చేసిన నిర్దేశం మేరకు పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పనులను గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం అధికారులు వేగంగా ముందుకు తీసుకువెళ్తున్నారు.

# తెలంగాణ ప్రజలను కేంద్రం అవమానించింది

**మొదటిపేజీ తరువాయి**

టీబీజేపీ ఎంపీలు గుజరాత్‌ను సపోర్ట్ చేస్తున్నారా? టీబీజేపీ ఎంపీలకు తెలంగాణ అభివృద్ధి అవసరం లేదా? అని ప్రశ్నించారు. 'నా పర్యటనను అడ్డుకోవడమంటే.. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమే. నా పర్యటనను అడ్డుకోవడం తెలంగాణపై వివక్ష చూపించడమే. నా పర్యటనను అడ్డుకున్నారు.. మా లక్ష్యాలను అడ్డుకోలేరు. నాది చాటుమాటు పర్యటన కాదు.. అధికారిక పర్యటన. విదేశాల్లో ఉండగా స్పందిస్తే.. దేశద్రోహి అనేవారు. అందుకే ఇక్కడికి వచ్చి కేంద్రం వైఖరిపై మాట్లాడుతున్నా. ఏ విదేశీ పర్యటన అయినా భారత ఎంబసీ పర్యవేక్షిస్తుంది. మా పర్యటన వివరాలను వారే కేంద్రానికి తెలియజేస్తారు. ఇందులో రహస్యం ఏముంది' అని ప్రశ్నించారు. కేంద్రానికి తెలంగాణ అంటే చులకన, చిన్నచూపు అంటూ రేవంత్ వ్యాఖ్యానించారు. తన పర్యటనను అడ్డుకోవడం పూర్తిగా వివక్షే అని అన్నారు. ఈ అంశాన్ని రాహుల్, ఖర్గే పార్లమెంట్‌లో ప్రస్తావిస్తారని తెలిపారు. విదేశాంగశాఖ అధికారి బీజేపీలో చేరడం మంచిదని హితవుపలికారు. కాంగ్రెస్ సీఎంననే తన పర్యటనను అడ్డుకున్నారని ఆరోపించారు. మెట్రో సహా చాలా




అంశాల్లో కేంద్రం సహకరించట్లేదన్నారు. సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అంటే ఇదేనా అని ప్రశ్నించారు. మోదీకి బీజేపీ పాలిత రాష్ట్రాలు తప్ప.. ఇతర ప్రాంతాల అభివృద్ధి అవసరం లేదన్నారు. కేంద్రం వివక్షను సహించేది లేదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కేంద్రం నన్ను అడ్డుకున్నా. నా లక్ష్యాన్ని అడ్డుకోలేదన్నారు. డిసెంబర్‌లో ఫ్యూచర్ సిటీలో పెట్టుబడుల సదస్సు నిర్వహిస్తాం. హైదరాబాద్‌లో పెట్టుబడులకు గల అవకాశాలను వివరిస్తాం. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవాలని గుజరాత్ నాయకత్వం కుట్ర చేస్తోంది. మన రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకోవడమే వారి లక్ష్యం. తెలంగాణపై గుజరాత్ ఆధిపత్యాన్ని అందరూ ఖండించాలి. ప్రధాని మోదీ గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్ మాదిరిగా వ్యవహరిస్తున్నారు. భారత్‌కు వచ్చే పెట్టుబడులన్నీ గుజరాత్‌కు రావాలని మోదీ చూస్తున్నారు. తెలంగాణ సీఎం పర్యటనను అడ్డుకోవడం గురించి పార్లమెంటులో లేవనెత్తుతాం. దీన్ని వదిలిపెట్టేది లేదు. మమ్దానీ న్యూయార్క్ ప్రజలు ఎన్నుకున్న మేయర్. ఆయనేమీ అసాంఘిక శక్తికాదు కదా అని అన్నారు. నరేంద్ర మోదీ ప్రధానిగా పాక్ వెళ్లి ఆయన మిత్రుడితో కలిసి బిర్యానీ తిని రాలేదా? మేం మాత్రం పెట్టుబడుల కోసం అమెరికా వెళ్లకూడదా? మోదీ ప్రధాని అయ్యాక ప్రజాస్వామ్యం సన్నగిల్లింది. నిరంకుశత్వం పెరిగింది. మోదీ వైఖరి ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం.. ఆయన వైఖరితో కేంద్ర, రాష్ట్ర సంబంధాలు దెబ్బతింటున్నాయి. బీఆర్ఎస్ నేతలు హరీశ్, కేటీఆర్, కవిత పిల్లలు విదేశాల్లో చదువుకుంటున్నారు. వారికి అమెరికా పర్యటనలకు అనుమతులు వస్తున్నాయి. సీఎంగా నా పర్యటనకు మాత్రం అనుమతి ఇవ్వడంలేదు. నేనూ హార్వర్డ్ యూనివర్సిటీలో చదివాను. ఒప్పందాల విషయంలో అమెరికా నుంచి నాకు ఆహ్వానం ఉందన్నారు. ఈ ప్రెస్‌మీట్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మీ కేసులో ప్రభుత్వానికి స్వల్ప ఊరట

**మొదటిపేజీ తరువాయి**

ఈ పథకాల వర్తింపుపై విధించిన స్టేను హైకోర్టు సోమవారం ఎత్తివేసింది. దివ్యాంగులకు మినహా మిగిలిన వారికి ఈ రెండు పథకాలపై విధించిన స్టే కొనసాగుతోందని స్పష్టం చేసింది. అయితే దీనిపై వాదనలు వినిపించడానికి రాష్ట్ర ప్రభుత్వం రెండు వారాల గడువు కోరింది. ఈ పథకాల కింద సాధారణ లబ్దిదారులతో పోలిస్తే దివ్యాంగ వధువులకు 25 శాతం అదనంగా ఆర్థిక సాయం అందించేలా గతంలో ప్రభుత్వం జీవో జారీ చేసింది. సోమవారం ఈ పథకాల అమలుపై దాఖలైన పిటిషన్లపై విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. దివ్యాంగుల హక్కుల చట్టం నిబంధనలకు అనుగుణంగానే ఈ ప్రత్యేక ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు హైకోర్టు ధర్మాసనానికి స్పష్టం చేశారు. ప్రభుత్వ వాదనలతో ధర్మాసనం ఏకీభవించింది. దీంతో దివ్యాంగ వధువులకు ఈ పథకాల కొనసాగింపునకు ఆదేశించింది.

## ఫేక్ సమాచారాన్ని వ్యాప్తి చేస్తే కఠిన సైబర్ చర్యలు

**మొదటిపేజీ తరువాయి**

సోమవారం ఒక ప్రకటనలో తీవ్రంగా హెచ్చరించారు.

ఎన్నికల కమిషన్ అధికారిక చిహ్నాలు, లోగోలను దుర్వినియోగం చేసి కొందరు ఉద్దేశపూర్వకంగా ఈ నకిలీ షెడ్యూల్‌ను సృష్టించి ప్రచారం చేస్తున్నారని పునేతా తెలిపారు. ఈ షెడ్యూల్‌పై స్పష్టత కోరుతూ తమ కార్యాలయానికి అనేక ఫోన్ కాల్స్ వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఎన్నికలకు సంబంధించిన ఎలాంటి సమాచారమైనా అధికారిక పత్రికా ప్రకటనల ద్వారా లేదా మీడియా సమావేశాల ద్వారా మాత్రమే వెల్లడిస్తామని, ప్రజలు అనధికారిక వార్తలను ఏమాత్రం పట్టించుకోవద్దని సూచించారు. ఖచ్చితమైన సమాచారం కోసం ఎస్ఈసీ అధికారిక వెబ్‌సైట్‌ను మాత్రమే సంప్రదించాలని కోరారు.

మరోవైపు, రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ఆగస్టు 19న జీవో జారీ చేసిన నేపథ్యంలో ఎన్నికల సంఘం సన్నాహాలు ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా 100 మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే, న్యాయస్థానాల్లో కేసులు పెండింగ్‌లో ఉండటం వల్ల మరో 23 మున్సిపాలిటీలలో ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. త్వరలోనే అధికారికంగా షెడ్యూల్ విడుదల చేస్తామని, అప్పటివరకు వదంతులను నమ్మవద్దని అధికారులు స్పష్టం చేశారు.

## తెలంగాణలో నేడు పాలిటెక్నిక్ కాలేజీల బంద్

**మొదటిపేజీ తరువాయి**

యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి అనుసంధానిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 97ను ఏబీవీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను బలోపేతం చేయాల్సింది పోయి, ఈ నిర్ణయం ద్వారా వాటిని ప్రైవేటీకరించే కుట్ర జరుగుతోందని ఆరోపించింది.

ఈ నూతన విధానం వల్ల పాలిటెక్నిక్ విద్యార్థులు బీటెక్‌లో లాటరల్ ఎంట్రీ ద్వారా ప్రవేశం పొందే అవకాశాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ఈ జీవోను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయానికి నిరసనగా రేపు చేపట్టనున్న బంద్‌ను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఏబీవీపీ విద్యార్థులకు పిలుపునిచ్చింది.

# ఫీజు బకాయిల రగడ..

**హైదరాబాద్‌లో బీజేపీ నేత రాంచందర్ రావు 48 గంటల దీక్ష**

ఆగస్టు 24.(ప్రజావినికడి):

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు సోమవారం హైదరాబాద్‌లో 48 గంటల నిరాహార దీక్షను ప్రారంభించారు. దాదాపు రూ.15,000 కోట్ల బకాయిలు పేరుకుపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని ఆయన ఆరోపించారు.

ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ, ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడం వల్ల కళాశాల యాజమాన్యాలు విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేస్తున్నాయని, తద్వారా వారు ఉన్నత విద్యకు, ఉద్యోగ అవకాశాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, ఇదే విద్యార్థులు త్వరలో ప్రభుత్వాన్ని గద్దె దించుతారని ఆయన హెచ్చరించారు. విద్యార్థులపై రాహుల్ గాంధీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే, తెలంగాణకు వచ్చి బకాయిలు విడుదల కోసం చొరవ చూపాలని సవాల్ విసిరారు.

**రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికే ఈ డ్రామా: పొన్నం ప్రభాకర్**


రాంచందర్ రావు దీక్షపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. తన రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికే రాంచందర్ రావు ఈ తరహా డ్రామాలు ఆడుతున్నారని ఆయన విమర్శించారు. చేతనైతే కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావాలని సవాల్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన బకాయిలను సైతం తమ ప్రభుత్వం ప్రస్తుతం చెల్లిస్తోందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు బ్యాంకుల ద్వారా అడ్వాన్స్‌గా ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయాన్ని కల్పిస్తామని పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. అలాగే, సంక్షేమ హాస్టళ్లకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులను విడుదల చేస్తామని తెలిపారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఇటువంటి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలవుతోందా అని ఆయన ప్రశ్నించారు.

## ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసు.. సాదిక్ ఖాన్‌కు రిమాండ్

**కాకినాడ ఆగస్టు 24.(ప్రజావినికడి):**

రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన కాకినాడ ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో ప్రధాన నిందితుడు సాదిక్ ఖాన్‌కు కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఘటన జరిగిన నాటి నుంచి తప్పించుకు తిరుగుతున్న అతడిని ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో అరెస్ట్ చేసిన పోలీసులు, సోమవారం కాకినాడకు తీసుకొచ్చి కోర్టులో హాజరుపరిచారు. సాదిక్ ఖాన్ వేధింపుల కారణంగానే నూకరాజు కుటుంబం బలవన్మరణానికి పాల్పడిందని కాకినాడ ఎస్పీ బిందుమాధవ్ మీడియా సమావేశంలో స్పష్టం చేశారు.కేసు దర్యాప్తు



వివరాలను ఎస్పీ వెల్లడిస్తూ.. రెండు ఆత్మహత్య లేఖలు ఈ కేసులో కీలక ఆధారాలుగా నిలిచాయని తెలిపారు. నూకరాజు రాసిన లేఖతో పాటు, ఆయన కుమార్తె సౌజన్య స్కూటీలో లభించిన మరో లేఖలోనూ సాదిక్ ఖాన్ పేరు స్పష్టంగా ఉందని చెప్పారు. అతని వేధింపులు భరించలేకే ఈ తీవ్ర నిర్ణయం తీసుకుంటున్నట్లు వారు పేర్కొన్నారని, ఈ ఆధారాలతోనే దర్యాప్తును ముమ్మరం చేశామని వివరించారు. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న ఇతర లేఖల గురించి తాము ఇప్పుడేమీ చెప్పలేమని, పక్కా ఆధారాలతోనే ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తామని స్పష్టం చేశారు.

ఘటన అనంతరం సాదిక్ తన ఫోన్లను స్విచాఫ్ చేసి పోలీసులకు చిక్కకుండా తప్పించుకునే ప్రయత్నం చేశాడు. అతడిని పట్టుకునేందుకు 10 ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి, ఐదు రాష్ట్రాల్లో ముమ్మరంగా గాలించారు. చివరకు మీరట్‌లో అతడిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అనంతరం సర్పవరం పోలీస్ స్టేషన్‌లో ఏఎస్పీ, ఐదుగురు సీఐలతో కూడిన బృందం సాదిక్‌ను విచారించింది. వైద్య పరీక్షల అనంతరం కోర్టులో ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించడంతో అతడిని కాకినాడ సబ్ జైలుకు తరలించారు.మరిన్ని వివరాలు రాబట్టేందుకు మంగళవారం కస్టడీ పిటిషన్ దాఖలు చేస్తామని, కస్టడీ విచారణలో మరిన్ని కీలక అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని ఎస్పీ తెలిపారు. సాదిక్ నిర్వహిస్తున్న షూటింగ్ అకాడమీపైనా పూర్తిస్థాయిలో విచారణ జరుపుతామని అన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు కీలక సూచన చేసిన ఎస్పీ.. వేధింపులు ఎదురైనప్పుడు ప్రాణాలు తీసుకునే బదులు ధైర్యంగా పోలీసులను ఆశ్రయించాలని కోరారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచి, వారికి పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కేసులో నూకరాజు కుటుంబం ముందుగా ఎలాంటి ఫిర్యాదు చేయలేదని ఆయన పేర్కొనడం గమనార్హం.

# 750 గ్రాముల గంజాయి పట్టివేత..



**నాంపల్లి, (ప్రజావినికిడి):** కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గంజాయి అమ్మకాలు జరుపుతున్న పి.యశ్వంత్ (18),వి విజయ్ (24) అనే ఇద్దరు వద్ద డిటిఎఫ్ కుత్బుల్లాపూర్ టీం గంజాయిని పట్టుకున్నారు.నిందితుల వద్ద నుంచి 750 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.నిందితులను గంజాయిని కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు ఈ ఎస్ హనుమంతరావు తెలిపారు.

# రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణికి(53)ఫిర్యాదులు..





**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (53) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కిరణ్మయి, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి తో కలిసి అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ, ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.రెవెన్యూ శాఖ-26, ఇతర శాఖలు-27, మొత్తం 53 దరఖాస్తులు అందాయి.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారదా దేవి వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయురాలు సుధారాణి పదవీ విరమణ వేడుక








**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
షాద్‌నగర్ లోని జెడ్పీహెచ్ఎస్ (గర్ల్స్) పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా సేవలందించిన ఎం.సుధారాణి పదవీ విరమణ సందర్భంగా సోమవారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఎన్నో సంవత్సరాలుగా విద్యార్థులకు బోధిస్తూ, మార్గనిర్దేశం చేస్తూ వారి భవిష్యత్‌కు బాటలు వేసిన సుధారాణి సేవలను ఈ సందర్భంగా పలువురు కొనియాడారు.ఉపాధ్యాయ వృత్తిలో సుధారాణి అందించిన సేవలను, విద్యార్థుల పట్ల చూపిన ఆప్యాయతను, సహచరులతో కలిసిమెలిసి పనిచేసిన తీరును గుర్తుచేసుకుంటూ పలువురు శుభాకాంక్షలు తెలిపారు.పదవీ విరమణ అనంతరం ఆమె జీవితం ఆనందం, ఆరోగ్యం, సంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సుధారాణితో పాటు ప్రేమ్ రాజ్, నితిష,నిహారిక, జక్కుల జలజ, స్రవంతి రాజ్ తదితరులు పాల్గొని ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సుధారాణి తన సేవా కాలంలో అందించిన సహకారం, ఆదరాభిమానాలను గుర్తుచేసుకుంటూ కృతజ్ఞతలు తెలిపారు.

## బొట్టు నిఖిల్ ఆధ్వర్యంలో జరిగిన తోట్టెల కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తో పాల్గొన్న చైతన్యపురి బిఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి.



**కొత్తపేట్, ఆగస్టు,24 (ప్రజావినికిడి):**కొత్తపేట్ బోనాల జాతరలో భాగంగా చైతన్యపురి డివిజన్ లోని మారుతీ నగర్ లో బొట్టు నిఖిల్ ఆధ్వర్యంలో జరిగిన తొట్టెల కార్యక్రమంలో గౌరవ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తో కలిసి పాల్గొన్న చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి.తరువాత న్యూ ఇందిరా నగర్ సాయి ఆధ్వర్యంలో జరిగిన తొట్టెల కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.ఈ కార్యక్రమంలో చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కాలనీ సభ్యులు పాల్గొన్నారు

# జీవితాన్ని స్వీకరించండి, మాదకద్రవ్యాలను కాదు

**రాష్ట్ర బాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నరసింహ రెడ్డి -"ఎంజాయ్ పేరుతో గంజాయి వద్దురా !" నాటకం**




**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):**
యుక్త వయసులో ఉన్న విద్యార్థులు, యువత జీవితాన్ని స్వీకరించాలని, మాదకద్రవ్యాలను కాదని రాష్ట్ర బాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నరసింహ రెడ్డి కోరారు.డ్రగ్స్, గంజాయి వాడకం, అనర్థాలపై విద్యార్థులకు అవగాహనా కల్పించడానికి తెలంగాణ రాష్ట్ర బాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో "ఎంజాయ్ పేరుతో గంజాయి వద్దురా !" పేరుతో రాష్ట్ర బాషా సాంస్కృతిక సలహా మండలి సభ్యులు, తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ నేతృత్వంలో కళాజాతను హైదరాబాద్, నారాయణగూడ, బిజెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏనుగు నరసింహ రెడ్డి ప్రారంభించారు. నారాయణగూడ సిఐ ఏం.సైదేశ్వర్, కళాశాల ప్రిన్సిపాల్ కెప్టెన్ డా.ఏం.విజయ్ కుమార్,ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, కళాశాల కల్చరల్ కో ఆర్డినేటర్ లు కె.గీత,సి.వి.ఎల్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా తెలంగాణ ప్రజానాట్య మండలి కళాకారులూ "ఎంజాయ్ పేరుతో గంజాయి వద్దురా !" అనే పేరుతో ప్రదర్శించిన వీధి నాటకం విద్యార్థినీ విద్యార్థులను కనువిప్పు కలిగించింది. కళాజాత గోడ పత్రికను ఆవిష్కరించిన అనంతరం ఏనుగు నరసింహ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే ప్రమాదాల గురించి అవగాహన కల్పించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కార్యక్రమాలు చేపడుతుందని, తెలంగాణ రాష్ట్ర బాషా సాంస్కృతిక శాఖ,వీధి నాటకాలు, జానపద కళ, సంగీతం,నృత్యం వంటి సాంస్కృతిక కార్యక్రమాలను రూపొందించి విద్యార్థులకు, యువతకు మాదకద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులు డ్రగ్స్,గంజాయి బారిన పడకుండా ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం తమ జీవితాలను ఆలింగనం చేసుకోవాలని, మాదకద్రవ్యాలను కాదని అన్నారు. ఏం.సైదేశ్వర్ మాట్లాడుతూ పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా తన సేవలోని నిజ జీవిత అనుభవాలను పంచుకుంటూ, వ్యక్తులు, కుటుంబాలపై మాదకద్రవ్యాల వ్యసనం యొక్క తీవ్రమైన పరిణామాలను వివరించారు. గంజాయి,డ్రగ్స్ అమ్ముతున్న వారిపై లేదా కొంటున్న వారిపై కేసులు నమోదు చేసి జైళ్లకు పంపుతున్నామని చెప్పారు. శారీరక, మానసిక, సామాజిక శ్రేయస్సుపై మాదకద్రవ్యాల దుర్వినియోగం యొక్క హానికరమైన ప్రభావాలను తెలిపారు. డా.ఏం.విజయ్ కుమార్ మాట్లాడుతూ, అవగాహన, కార్యాచరణ, సామాజిక భాగస్వామ్యం ద్వారా ప్రతి విద్యార్థి ఆరోగ్యకరమైన, మాదకద్రవ్య రహిత భవిష్యత్తును ఎంచుకునేలా ప్రోత్సహించేందుకు "ఎంజాయ్ పేరుతో గంజాయి వద్దురా".. పేరుతో కళాజాతాను నిర్వహించడం అభినందనీయం అని అన్నారు. విద్యార్థులకు విద్యాబోధన చేయడమే కాకుండా,వారిని బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడానికి, విద్యార్థులు విద్యాపరంగా, వ్యక్తిగతంగా అభివృద్ధి చెందడానికి సురక్షితమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడంలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరం అని, భవిష్యత్తులో ఇలాంటి ప్రభావవంతమైన మరిన్ని కార్యక్రమాలను నిర్వహించడానికి ప్రోత్సహిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజానాట్య మండలి కళాకారులూ వి. వెంకట చారి,పి. సైదులు,విజయ్, రాములు, శైలజా,మంగ తదితరులు పాల్గొన్నారు.

# 'నేను సైతం 2.0'లో భాగంగా నాగోల్ లో 74 సీసీటీవీ కెమెరాలు ప్రారంభించిన ఎల్బీనగర్ ట్రాఫిక్ డీసీపీ బి. శ్రీనివాసులు..






**నాగోల్, (ప్రజావినికిడి):** మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా నిర్వహిస్తున్న 'నేను సైతం 2.0' కార్యక్రమంలో భాగంగా నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 74 సీసీటీవీ కెమెరాలను ఎల్బీనగర్ ట్రాఫిక్ డీసీపీ బి. శ్రీనివాసులు, నాగోల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ ప్రారంభించారు.కృషి నగర్‌లోని పల్లవి డీబీఆర్ అపార్ట్‌మెంట్స్‌లో 30, రాఘవేంద్రనగర్ కాలనీ,తట్టి అన్నారం డబుల్ బెడ్‌రూమ్, అన్నవరపు సత్యనారాయణ కాలనీల్లో మరో 44 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మొత్తం 74 కెమెరాలను బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ ట్రాఫిక్ ఏసీపీ బి. నవీన్‌రెడ్డి, ఎస్ఐలు పి. శివనాగ ప్రసాద్, ఉమ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డీసీపీ బి. శ్రీనివాసులు మాట్లాడుతూ,మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో 'నేను సైతం 2.0' కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు 2,58,457 సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎల్‌బీనగర్ జోన్ పరిధిలో 81,183 కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.ఈ కెమెరాల ఏర్పాటులో ఎల్‌బీనగర్ జోన్‌లోని 104 మంది ప్రజలు భాగస్వాములయ్యారని తెలిపారు.ప్రజల భాగస్వామ్యంతో ఏర్పాటు చేస్తున్న సీసీటీవీ కెమెరాలు నేరాల నియంత్రణ, నిందితుల గుర్తింపు,ప్రజల భద్రతకు ఎంతగానో దోహదపడుతున్నాయని అన్నారు.సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సీసీటీవీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణతో పాటు శాంతిభద్రతలను మరింత పటిష్ఠంగా నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాఘవేంద్రనగర్ కాలనీ,తట్టి అన్నారం డబుల్ బెడ్‌రూమ్, అన్నవరపు సత్యనారాయణ కాలనీ ప్రతినిధులు, అపార్ట్‌మెంట్ వాసులు డాక్టర్ విష్ణు,శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, శ్రీరాములు, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# కొండా సురేఖపై క్రమశిక్షణ చర్యలు ఉపసంహరించుకోవాలి

**జై గౌడ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నీరజ గౌడ్**




**అబిడ్స్, (ప్రజావినికిడి):**
కొండా సురేఖపై క్రమశిక్షణ చర్యలు ఉపసంహరించుకోవాలని జై గౌడ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నీరజ గౌడ్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పలుమార్లు కొండా సురేఖపై రాజకీయ నెపంతో పక్కకు వైదొలగించడం సరికాదన్నారు. తమ పార్టీలోని కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి వారి సోదరుడు వెంకటరెడ్డి చేసిన వ్యాఖ్యలను పట్టించుకోరు. కొండా సురేఖ వారి తనయ చేస్తే తప్పు అని చెప్పడం ఎంత వరకు సమంజసం అన్నారు. వరంగల్ జిల్లాలో వారి కుటుంబానికి ఎంతో గౌరవం ఉందని కొనియాడారు. నియోజక వర్గంలో పోటీ చేస్తానంటే తప్పని నిలదీశారు. కాంగ్రెస్లో ఒకరికి ఒకరు పొంతన లేక బర్తరఫ్ చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా సామాజిక న్యాయం దిశగా అడుగులు వేయాలని,రెడ్లకో న్యాయం బీసీలకు ఓ న్యాయం వీడనాడి అన్ని కులాలకు సమాన న్యాయం చేయాలనీ డిమాండ్ చేశారు. బీసీల మీద వరుస దాడులకు చరమగీతం విడాలన్నారు. బీసీ సమాజం పట్ల కుటిల వైఖరి విరమించుకోవాలని హితవు పలికారు.సమావేశంలో బీసీ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు వాసు యాదవ్, బ్లూ ఇండియ పార్టీ అధ్యక్షుడు బొంగు ప్రసాద్ గౌడ్, మన ఆలోచన సాధన సమితి అధ్యక్షులు కటకం నర్సింగరావు బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు చిన్న రాములు ముదిరాజ్,ఆల్ ఇండియా బహుజన సేన అధ్యక్షులు బెల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ లో బహుళ అంతస్తులు నిలుపుదల చెయ్యండి





**వాజేడు,ఆగస్టు 25,(ప్రజావినికిడి):**
వాజేడు మండలం పూర్తిగా ఏజెన్సీ ప్రాంతం ఇక్కడ 1/70,చట్టం అమలులో ఉన్నప్పటికీ1/70, చట్టం ఉల్లంగన జరుగుతుంది విచ్చలవిడిగా బహుళ అంతస్తులు కడుతున్నారు అలాగే పిచ్చలవిడిగా వ్యాపారాలు జరుగుతున్నాయి వీటి పై చర్యలు తీసుకోవాలని ఏటూరునాగారం, ఐటిడిఎ,లో జరుగుతున్న ప్రజావాణి లో పిఓ కి మండలం లో జరుగుతున్న ప్రజావాణి కార్యక్రమం లో ఆదివాసి నవనిర్మాణ సేనా అద్వర్యంలో తాసిల్దార్ కి వినతిపత్రం ఇచ్చారు పీసా చట్టం ఉన్న వ్యాపారాలు మాత్రం ఆగడం లేదు పీసా చట్టం తీర్మానం జరగకుండానే వ్యాపారాలు చేస్తున్నారు. వలస వ్యాపారస్తులను అరికట్టి వీటిపై తమరు తగిన చర్యలు తీసుకోవాలి లేనియెడల మా ఆదివాసి నవ నిర్మాణ సేన ప్రత్యక్ష ఉద్యమాలు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎట్టి విద్యాసాగర్, పాయం అజయ్, తల్లడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

# అక్రమ నిర్మాణాల కట్టడిలో

# ముగ్గురు కమిషనర్లు విఫలం..


**ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ.. చర్యలు మాత్రం శూన్యం..**

**జోనల్ కమిషనర్ల మౌనమే అక్రమ నిర్మాణాలకు అండగా మారిందా.?**

**అధికారుల నిర్లక్ష్యంతో గ్రేటర్ హైదరాబాద్ అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారిందన్న ఆరోపణలు..**

**అంజయ్య నగర్ సంఘటనతో ఇకనైనా కమిషనర్లు కఠిన చర్యలు తీసుకునేనా.?**

**కార్మికుల ప్రాణాలు పోతున్న, ప్రభుత్వ ఆదాయం భారీగా గండి కొడుతున్న అధికారులలో చలనం లేకపాయే.?**










**హైదరాబాద్, (ప్రజావినికిడి):**
గ్రేటర్ హైదరాబాద్‌లోని మూడు మున్సిపల్ కమిషనర్ కార్యాలయాల పరిధిలో అక్రమ నిర్మాణాల జోరు రోజురోజుకూ పెరుగుతున్నా వాటిని కట్టడి చేయాల్సిన ఉన్నత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజావాణిలో ప్రజలు ఎన్నో ఫిర్యాదులు చేస్తున్నా వాటిపై కఠిన చర్యలు ఎక్కడ కనిపించడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై ముగ్గురు కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, జోనల్ సిపి స్థాయి అధికారులకు ఫిర్యాదులు వెళ్తున్నా ఫలితం మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారిందని విమర్శలు వినిపిస్తున్నాయి.

**సాధారణ, ప్రజావాణి ఫిర్యాదులు బుట్టదాఖలా.?**
ప్రజావాణిలో అక్రమ నిర్మాణాలపై ఇప్పటివరకు ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి.? వాటిలో ఎన్ని పరిశీలించారు.? ఎన్ని నిర్మాణాలపై నోటీసులు ఇచ్చారు.? నోటీసులు ఇచ్చిన తర్వాత నిర్మాణాలు ఎలా జరుగుతున్నాయి.? సీజ్ చేసిన భవనాలు ఎన్ని.? సీజ్ చేసిన తర్వాత ఎన్ని నిర్మాణం పూర్తి చేసుకొని వినియోగంలో ఉన్నాయి.? ఎన్ని కూల్చివేశారు.? ఎన్ని కేసులు నమోదు చేశారు.? ఎన్ని ఫిర్యాదులు పరిష్కరించకుండా పెండింగ్‌లో ఉన్నాయి.? అనే వివరాలను కమిషనర్లు బహిర్గతం చేయగలరా.? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వాటిని బహిర్గతం చేయాల్సిన అవసరం ఉంది. ఒక్క ఫిర్యాదుపై అయిన పూర్తి స్థాయిలో చర్య తీసుకున్నారా.? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**ఉన్నత అధికారుల మౌనం ఎందుకు.?**
చైన్‌మెన్ నుంచి న్యాక్ ఇంజనీర్, సెక్షన్ ఆఫీసర్, ఏసీపీ,డిప్యూటీ కమిషనర్, జోనల్ ఏసీపీ, జోనల్ కమిషనర్ స్థాయి వరకు పర్యవేక్షణ వ్యవస్థ ఉన్నప్పటికీ అక్రమ నిర్మాణాలు ఎలా పుట్టుకొస్తున్నాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. కొందరు అధికారులు లంచాల తీసుకొని అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారనేది బహిరంగ రహస్యమే. ఇబ్బంది, అధికారులు అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్న నేపథ్యంలో ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేయించి వాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**పత్రికల్లో కథనాలు వచ్చినా స్పందన ఏది.?**
అక్రమ నిర్మాణాలపై పత్రికల్లో వరుస కథనాలు ప్రచురితమైనా ముగ్గురు కమిషనర్లు, సంబంధిత జోనల్ కమిషనర్లు, జోనల్ సీపీలు, డిప్యూటీ కమిషనర్లు ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజలు, జర్నలిస్టులు అక్రమాలను అధికారుల దృష్టికి తీసుకెళ్తే వారినే ఇబ్బందులకు గురి చేయడం, అక్రమ నిర్మాణదారులతో చెప్పి తప్పుడు కేసులు పెట్టడం వంటి అనేక ఆరోపణలు కూడా అధికారులపై వినిపిస్తున్నాయి.

అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చే వారిని కాకుండా అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

**సంఘటన జరిగినప్పుడే హడావుడినా.?**
ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు, కోర్టు ఆదేశాలు వచ్చినప్పుడు లేదా ముఖ్యమంత్రి సీరియస్ అయినప్పుడు మాత్రమే అధికారులు హడావుడిగా ప్రకటనలు చేయడం, తనిఖీలు నిర్వహించడం, పేరుకు నాలుగైదు అక్రమ నిర్మాణాలు కూల్చివేయడం అంతే,తరువాత వారం రోజులకే పరిస్థితి మళ్లీ యథాతథంగా మారుతోందన్న విమర్శలు ఉన్నాయి. ప్రమాదాలు జరిగిన తర్వాత కమిషనర్లు స్పందించడం కాదు. ప్రమాదాలకు కారణమయ్యే అక్రమ నిర్మాణాలను ముందుగానే గుర్తించి అడ్డుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

**విజిలెన్స్ నివేదికలపై చర్యలేవి.?**
అక్రమ నిర్మాణాలపై విజిలెన్స్ అధికారులు ఇచ్చిన నివేదికలు ఏమయ్యాయి.? వాటిపై తీసుకున్న చర్యలేంటి.? బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారా.? అన్నది కూడా స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది. అవినీతి అధికారులపై నివేదికలు తయారవుతున్నా చర్యలు లేకపోతే అవి కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయన్న అనుమానాలకు బలం చేకూరుతుంది. జిహెచ్ఎంసిలో విజిలెన్స్ విభాగం ఉండి కూడా ఇంత అవినీతి జరుగుతుంది అంటే మరి విజిలెన్స్ విభాగం ఉంది ఏం ఉపయోగమో ప్రభుత్వానికే తెలియాలి.

**కోర్టు స్టే లపై ఎందుకీ నిర్లక్ష్యం.?**
కోర్టు కేసులు, స్టే ఆర్డర్లు ఉన్న నిర్మాణాల విషయంలో డిప్యూటీ,జోనల్ కమిషనర్లు, ఇతర సంబంధిత అధికారులు నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తున్నారా.? స్టే తొలగింపునకు కౌంటర్లు వేస్తున్నారా.? వేయకుంటే ఎందుకు వేయడం లేదు.? లేక వాటిని పట్టించుకోకుండా నిర్మాణాలు కొనసాగుతున్నా మౌనం వహిస్తున్నారా.? అన్నది తేలాల్సి ఉంది.

గ్రేటర్ హైదరాబాద్‌లో మూడు కమిషనర్ కార్యాలయాల పరిధిలో అధికారులు ప్రజల కోసం విధులు నిర్వహిస్తున్నారా.? లేక అక్రమాలకు అండగా నిలుస్తున్నారా.? అన్నది కమిషనర్లే తేల్చాలి.అక్రమ నిర్మాణాలపై వచ్చిన ప్రతి ఫిర్యాదును ప్రత్యేకంగా సమీక్షించి, పెండింగ్ ఫిర్యాదులపై గడువుతో కూడిన చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాల్సిన కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, ఉన్నత అధికారులు మౌనం వహిస్తే.. ఆ మౌనం వెనుక కారణమేంటో ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వం పైనే ఉంది

## ఏజెన్సీలో ఎస్టీ సర్టిఫికెట్లపై పూర్తి విచారణ జరగాలి..

**అర్హత లేని వారికి ధృవీకరణ పత్రాలు జారీ చేయొద్దు.. ఆదివాసుల హక్కుల పోరాట సమితి**

**వాజేడు,ఆగష్టు 25,(ప్రజావినికిడి):**
ములుగు జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లో ఎస్టీ కుల ధృవీకరణ పత్రాల జారీ ప్రక్రియపై సమగ్ర విచారణ నిర్వహించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు.ఈ మేరకు వాజేడు మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. గిరిజనుల రాజ్యాంగ బద్ధమైన హక్కులు, రిజర్వేషన్లు, విద్యా-ఉద్యోగ అవకాశాలు, సంక్షేమ ప్రయోజనాలు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని నాయకులు పేర్కొన్నారు.ఎస్టీ సర్టిఫికెట్ల జారీ సమయంలో దరఖాస్తుదారుల పూర్వీకుల కుల రికార్డులు,పాత పాఠశాల రికార్డులు, రెవెన్యూ రికార్డులు, నేటివిటీ తదితర చట్టబద్ధమైన ఆధారాలను సమగ్రంగా




పరిశీలించాలని కోరారు.ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చి ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న వ్యక్తులకు కేవలం ప్రస్తుత నివాసం ఆధారంగా ఎస్టీ ప్రయోజనాలు కల్పిస్తున్నారనే ఫిర్యాదులపై కూడా నిబంధనల ప్రకారం విచారణ జరపాలని డిమాండ్ చేశారు.తప్పుడు సమాచారం లేదా తప్పుడు పత్రాల ఆధారంగా ఎస్టీ సర్టిఫికెట్ పొందినట్లు నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.ఇప్పటికే జారీ చేసిన అనుమానాస్పద ఎస్టీ ధృవీకరణ పత్రాలను నిబంధనల ప్రకారం పునఃపరిశీలించాలని, సర్టిఫికెట్ల జారీ ప్రక్రియలో స్థానిక రికార్డులు సంబంధిత అధికారుల నివేదికలను పరిగణనలోకి తీసుకోవాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.అర్హత ఉన్నవారికి మాత్రమే ఎస్టీ ధృవీకరణ పత్రాలు జారీ చేయాలి.అర్హత లేని వారికి లేదా తప్పుడు పత్రాలతో పొందిన సర్టిఫికెట్లపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. ఆదివాసీ గిరిజనుల హక్కులకు నష్టం కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలి అని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆదివాసుల హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షులు,పాయం జానకి రమణ, వాజేడు మండల అధ్యక్షుడు తొర్రెమ్ సంతోష్, ఉపాధ్యక్షుడు వాసం సంతోష్, మండల కార్యదర్శి చాప లక్ష్మణ్, ఆదివాసీ సంక్షేమ పరిషత్‌కు చెందిన జిల్లా అధ్యక్షులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిపై కబ్జా యత్నం

**ఎలికట్టలో సర్వే నంబర్ 686లో అర్ధరాత్రి భూమి చదును..**

**అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడడానికి గ్రామస్తుల డిమాండ్..**

**షాద్‌నగర్,(ప్రజావినికిడి):**
ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామంలోని సర్వే నంబర్ 686లో ఉన్న ప్రభుత్వ "తక్రార్" భూమిపై గుర్తుతెలియని రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జాకు ప్రయత్నిస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.ఆదివారం అర్ధరాత్రి నుంచి ప్రభుత్వ (తక్రార్)భూమిలో చదును చేస్తున్న స్థానికులు సమాచారం ఇచ్చారు.షాద్‌నగర్ ప్రాంతంలో భూముల ధరలు పెరగడంతో



కొందరు రియల్ వ్యాపారులు ప్రభుత్వ,వివాదాస్పద భూములపై కన్నేసి రాత్రివేళల్లో కబ్జాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఉదయం ప్రజలు గమనించే సమయానికి భూమి స్వరూపాన్ని మార్చి, అనంతరం వివాదాలు తలెత్తినప్పుడు పోలీస్ స్టేషన్లను ఆశ్రయిస్తున్న ఘటనలు జరుగుతున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు.ఎలికట్ట గ్రామ శివారులోనిసర్వే నంబర్ 686లోని ప్రభుత్వ భూమిపై జరుగుతున్న కబ్జా యత్నాన్ని అధికారులు వెంటనే పరిశీలించి,భూమి హద్దులను నిర్ధారించి ప్రభుత్వ ఆస్తిని పరిరక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.ఈ వ్యవహారంపై రెవెన్యూ అధికారులు,పోలీసులు సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## నకిలీ డీఎస్పీగా ప్రజలకు టోపీ

**రూ.1.20 కోట్లు వసూళ్లు**

**వలపన్ని పట్టుకుని అరెస్ట్ చేసిన పోలీసులు**

**హైదరాబాద్,ఆగస్టు 24.(ప్రజావినికడి):**
నగరంలో నకిలీ డీఎస్పీగా అవతారమెత్తి అమాయకులను మోసం చేస్తున్న కేవీపీ రాజు అలియాస్ డీఎస్పీ రాజును హైదరాబాద్ సీసీఎస్ ఈఓడబ్ల్యూ బృందం అరెస్ట్ చేసింది. తిరుపతి డీఎస్పీ పేరును ఉపయోగించుకుంటూ తనకు ఉన్నతస్థాయి పరిచయాలు ఉన్నాయని నమ్మిస్తూ పలువురి నుంచి భారీగా డబ్బులు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. బోగస్ కంపెనీల్లో పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయని ఆశ చూపించి బాధితులను తన వలలోకి లాగినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ క్రమంలో ఓ బాధితుడి నుంచి ఏకంగా రూ.1.20 కోట్లు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. తెలంగాణతో పాటు ఏపీలోనూ పలువురిని ఇదే తరహాలో మోసం చేసినట్లు నిందితుడి పై ఆరోపణలు ఉన్నాయి. నకిలీ హోదాలు, అధికారుల పేర్లు



ఉపయోగించుకుని బాధితుల్లో నమ్మకం కలిగించి డబ్బులు దండుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. 2021 నుంచి పోలీసులకు చిక్కకుండా పరారీలో ఉన్న కేవీపీ రాజును ఎట్టకేలకు సీసీఎస్ ఈఓడబ్ల్యూ అధికారులు అరెస్ట్ చేశారు. కేవీపీ రాజు అలియాస్ డీఎస్పీ రాజుపై ఇప్పటికే మూడు క్రిమినల్ కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. నకిలీ డీఎస్పీగా తనను తాను పరిచయం చేసుకుంటూ భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసిన వ్యవహారంపై మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడి ద్వారా మోసపోయిన బాధితులు ఇంకా ఎవరైనా ఉన్నారా, అతడి మోసాల వెనుక మరికొందరి ప్రమేయం ఉందా అనే కోణంలోనూ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. అరెస్ట్ అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

------------

## ఘనంగా అమ్మవారి పలారం బండి తొట్టెల ఊరేగింపు



**ఎల్బీనగర్,ఆగస్ట్ 24, (ప్రజావినికిడి):** కొత్తపేట్ డివిజన్ పరిధిలో బోనాల పండుగ సందర్భంగా శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలరాం బండి తొట్టెల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కొత్తపేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ పాల్గొని అమ్మవారి ఆశీర్వాదం తీసుకున్నారు.ఈ సందర్భంగా అమ్మవారి దివ్య ఆశీస్సులు కొత్తపేట్ డివిజన్ ప్రజలందరిపై ఉండాలని అన్నారు.తొట్టెల ఊరేగింపు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.బోనాలను ప్రజలు ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని కొమ్ము బాబు రావు అన్నారు.ఈ కార్యక్రమంలో కొమ్ము సాయి ప్రసాద్,కొమ్ము మహేష్,శ్రీనివాస్, రామకష్ణ, చంద్రమోహన్,రఘు,రామ్ బాబు,గిరి,సందీప్,సాయి, రాజు,అనిల్, మహేష్, ఉదయ్,అనిల్,అజయ్, బబ్లూ,హరీష్,ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

# బ్రోకర్లను నమ్మి మోసపోవద్దు..

**22ఎ, భూ భారతి భూములలో పారదర్శకత**

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. -రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి..**




**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**
రంగారెడ్డి జిల్లాలో 22ఎ జాబితాలో ఉన్న భూములు, భూ భారతి రికార్డులకు సంబంధించిన భూముల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి సూచించారు.కొంతమంది మధ్యవర్తులు, బ్రోకర్లు భూముల రికార్డులను సరిచేస్తామని, 22ఎ జాబితా నుంచి భూములను తొలగిస్తామని, భూ భారతి ద్వారా భూమిపై హక్కులు కల్పిస్తామని చెబుతూ ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం అందుతోందన్నారు.ఇలాంటి వ్యక్తుల మాటలను నమ్మి ప్రజలు మోసపోవద్దని ఆయన స్పష్టం చేశారు.భూమిని కొనుగోలు చేసే ముందు లేదా భూమికి సంబంధించిన ఏదైనా లావాదేవీ నిర్వహించే ముందు సంబంధిత రెవెన్యూ అధికారులను సంప్రదించి సర్వే నంబర్,భూమి స్థితి,22ఎ జాబితాలోని వివరాలు, భూ భారతి రికార్డులు,ఇతర చట్టపరమైన అంశాలను అధికారికంగా నిర్ధారించుకోవాలని సూచించారు.ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేయిస్తామని చెప్పే మధ్యవర్తులు, బ్రోకర్లను నమ్మి ఎలాంటి డబ్బులు చెల్లించవద్దని అదనపు కలెక్టర్ హెచ్చరించారు. భూములకు సంబంధించిన సమస్యలు లేదా అనుమానాలు ఉన్నట్లయితే సంబంధిత తహసీల్దార్ కార్యాలయం లేదా అధికారిక రెవెన్యూ కార్యాలయాలను సంప్రదించి వివరాలు, స్పష్టత పొందాలని సూచించారు.
ప్రజలు భూములకు సంబంధించిన వ్యవహారాల్లో అధికారిక విధానాలను మాత్రమే అనుసరించాలనిమధ్యవర్తులు లేదా బ్రోకర్ల ద్వారా జరిగే అనధికారిక లావాదేవీలకు దూరంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి కోరారు.

# కొత్తపేట లో ఘనంగా బోనాల ఉత్సవాలు





**ఎల్బీనగర్,ఆగస్ట్ 24,(ప్రజావినికిడి):**
కొత్తపేటలో మహంకాళి దేవాలయం సింతోట మైసమ్మ తల్లి దేవాలయం,బురుజు మైసమ్మ దేవాలయంలో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఎల్బీనగర్ లో చివరి బోనాల సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారికి బోనాలు సమర్పించారు.ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వర్షాలు సమృద్ధిగా కురవాలని అమ్మవారిని కోరడం జరిగిందని సుదీర్ రెడ్డి పేర్కొన్నారు.ఎల్బీనగర్ నియోజకవర్గం లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కొమ్ము సాయి ప్రసాద్,కొమ్ము మహేష్,శ్రీనివాస్, రామకృష్ణ, చంద్రమోహన్,రఘు,రామ్ బాబు,గిరి,సందీప్,సాయి, రాజు,అనిల్,మహేష్,ఉదయ్, అనిల్,అజయ్,బబ్లూ,హరీష్,ధనుష్,మహేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 11న బ్యాంక్ యూనియన్ల సమ్మె

**వరుస సెలవులతో కస్టమర్లకు ఇబ్బందులే**




**హైదరాబాద్,ఆగస్టు24(ప్రజావినికడి):**
: దేశవ్యాప్తంగా అన్ని బ్యాంకుల్లో 5 రోజుల పని విధానాన్ని వెంటనే అమలు చేయాలంటూ బ్యాంక్ యూనియన్ల ఐక్య వేదిక డిమాండ్ చేస్తోంది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ డిమాండ్‌ను నెరవేర్చుకునేందుకు సెప్టెంబర్ 11న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చారు. ఆ రోజున సమ్మె జరిగితే.. బ్యాంకు కార్యకలాపాలకు వరుసగా నాలుగురోజుల పాటు అంతరాయం కలగనుంది. సెప్టెంబర్ 11న శుక్రవారం. తర్వాత రెండో శనివారం, ఆదివారం ప్రభుత్వ సెలవులు. ఇక సోమవారం14న వినాయక చవితి కావడంతో తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా పలు చోట్ల బ్యాంకు కార్యకలాపాలు నడవవు. అలా నాలుగురోజుల పాటు బ్యాంక్ సేవలు అందక ప్రజలు కొంత ఇబ్బంది పడాల్సి వస్తుంది. 11వ తేదీతోపాటు సెప్టెంబర్ 28 నుంచి మూడురోజుల పాటు మరోసారి సమ్మె చేస్తామని యూనియన్ హెచ్చరించింది. సెప్టెంబర్ 30తో ఆర్థిక సంవత్సరం సగం పూర్తవుతుంది. అప్పుడు అన్ని సంస్థలు తమ ఖాతా పుస్తకాలను సరిచూసుకుంటాయి. వారానికి ఐదు రోజుల డిమాండ్‌తో పాటు పనితీరు ఆధారిత ప్రోత్సాహకాల పథకం, పింఛను విషయంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని బ్యాంక్ సిబ్బంది కోరుతున్నారు. ఇప్పటికే రెండో, నాలుగో శనివారం సెలవులు ఇస్తున్నారు. మరో రెండు సెలవులు ఇస్తే అలా నెలలో ఐదురోజుల పనిదినం అమలవుతుంది. తమ డిమాండ్లను పట్టించుకోకపోతే.. అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని ప్రకటించారు. సమావేశంలో బ్యాంక్ యూనియన్ల సభ్యులు ఈ నిర్ణయాలు తీసుకున్నారు.

# సారంపల్లి మృతి పట్ల కేసీఆర్ సంతాపం

**హైదరాబాద్,ఆగస్టు24 (ప్రజావినికడి):**
అఖిలభారత రైతు సంఘం నేత, కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి కన్నుమూసిన సంగతి తెలిసిందే. ఆయన మృతి పట్ల బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సారంపల్లి మల్లారెడ్డి తన జీవితకాలమంతా రైతాంగ సమస్యల పరిష్కారం కోసం, వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం నిబద్ధతతో పోరాటం చేసిన గొప్ప రైతు ఉద్యమ నాయకుడని కేసీఆర్ కొనియాడారు. ఆయన మరణం భారత రైతాంగ పోరాటాలకు తీరని లోటని పేర్కొన్నారు. మల్లారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# పట్టా భూమి రిజిస్టర్ ప్రభుత్వ భూమిలో పొజిషన్

**అన్నారం లో 133 గజాల ప్రభుత్వ స్థలం కబ్జా -నోటీసులు జారీ చేసి, పనులను నిలిపివేసిన పంచాయతీ పాలకవర్గం**






**షాద్ నగర్,(ప్రజావినికిడి):** రిజిస్ట్రేషన్ చేసింది పట్టా భూమి పొజీషన్ చూపించింది అసైన్డ్ భూమి తీరా అసలు విషయం బయటకు రాగా అసైన్డ్ భూమి ఆక్రమణ అవుతుందని గ్రామస్తుల గగ్గోలు,ఈ కబ్జా కు సంబంధించి స్థానికులు తెలిపిన పూర్తి వివరాలు. ఫరూఖ్ నగర్ మండల పరిధిలోని అన్నారం గ్రామంలో సర్వే నెంబర్ (5)లో లంకాల రాములు గౌడ్ కు పట్టా భూమి ఉన్నది.తన పట్టా భూమి నుండి రాములు గౌడ్ 133 గజాల స్థలాన్ని అదే గ్రామానికి చెందిన గూడెం కృష్ణవేణి పాండు రంగం గౌడ్ కు విక్రయించారు. ఇదంతా బాగానే ఉంది.తన పట్టా భూమినుండి స్థలాన్ని అమ్మిన రాములు గౌడ్ పొజీషన్ ను మాత్రం తన పట్టా భూమిలో చూపకుండా పక్కనే ఉన్న అసైన్డ్ భూమిలో పొజిషన్ చూపించాడు.సర్వే నెంబర్ (5)కు ఆనుకుని పక్కనే ఉన్న సర్వే నెంబర్ 4 పూర్తిగా ప్రభుత్వ అసైన్డ్ భూమి.ఇందులో అన్నారం గ్రామంలోని ఇల్లు లేని వారికి ఇళ్ల స్థలాలు



కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలం


(గ్రామ కంఠం)కు కొంత భూమి కేటాయించగా మిగిలిన 1-20 గుంటల భూమినీ గ్రామానికి చెందిన పేద రైతుకు ప్రభుత్వం అసైన్డ్ చేసింది.ఇదే అదునుగా భావించిన రాములు గౌడ్ తనకు పట్టా ఉన్న స్థలాన్ని విక్రయించి గ్రామ కంఠం స్థలంలో కృష్ణవేణి పాండురంగం కు పొజీషన్ ఇచ్చాడు.ఇది గమనించిన గ్రామ సర్పంచ్ తో పాటు పాలక వర్గం,గ్రామస్తులు అంతా కలసి సదరు స్థలంలో నిర్మాణాలు జరుపుతుంటే అడ్డుకున్నారు.అంతే కాకుండా పంచాయతీ నుండి నోటీసులు జారీ చేసి ఎలాంటి నిర్మాణాలు చేయరాదని పేర్కొన్నారు. అయినా పరిస్థితి మాత్రం మారకుండా తగ్గేదేలే అన్నట్లుగా స్థలం విక్రయించిన రాములు గౌడ్ తాను చేసింది కరక్టే నని మొండిగా వ్యవహరిస్తున్నట్లు గ్రామ పంచాయతీ పాలక వర్గం ఆరోపిస్తోంది.
ఇదిలా ఉండగా గతంలో కూడా రాములు గౌడ్ ఇదే అసైన్డ్ స్థలాల్లో నుండి ఇదే తరహాలో అక్రమంగా పరువురికి అమ్మకాలు జరిపి ఆక్రమణలు చేశాడనే ఆరోపణలు వస్తున్నాయి.ఈ తతంగంపై రెవెన్యూ, పంచాయతీ అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

# ప్రతి వ్యక్తి, ప్రతి ఇంటికి ఒక మొక్క అందించేలా విస్తృతంగా వన మహోత్సవ కార్యక్రమాలు చేపట్టాలి..

**అటవీ, పర్యావరణ అదేవిదంగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ.**






**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**
వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 56.46 శాతం మొక్కల పెంపకం పూర్తయిందని ఈ నెల 25న నిర్వహించనున్న ప్రత్యేక వన మహోత్సవ కార్యక్రమం ద్వారా నిర్దేశిత లక్ష్యానికి అదనంగా కనీసం 10 శాతం మేర మొక్కలు నాటేలా అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అటవీ, పర్యావరణ మరియు దేవాదాయ శాఖ మంత్రి సూచించారు.వన మహోత్సవం కార్యక్రమం అమలు పై సోమవారం అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించడం జరిగింది.
ఈ సందర్భంగా మంత్రి జిల్లా వారీగా మొక్కలు నాటే లక్ష్యాలుఇప్పటి వరకు సాధించిన పురోగతిని సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ నెల 23వ తేదీ నాటికి రంగారెడ్డి జిల్లాలో 78.540 లక్షల మొక్కలు నాటే లక్ష్యానికి గాను 45.287 లక్షల మొక్కలు నాటి 57.66 శాతం సాధన నమోదైనట్లు సమీక్షలో వెల్లడైంది.
రాష్ట్రవ్యాప్తంగా 1606.286 లక్షల మొక్కల లక్ష్యానికి గాను 906.853 లక్షల మొక్కలు నాటి 56.46శాతం సాధన నమోదైంది.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ నెల 25న నిర్వహించనున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించి, “ఒక్క వ్యక్తికి ఒక మొక్క ఒక్క ఇంటికి ఒక మొక్క” అనే విధంగా ప్రజల భాగస్వామ్యంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని విస్తృతం చేయాలని సూచించారు.
ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, ఎన్‌సీసీ విద్యార్థులు, ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది, పరిశ్రమల ప్రతినిధులు, అంగన్‌వాడీ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామ ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వీఐపీలు, రైతులు, యువత, సామాజిక సంస్థలు, మీడియా ప్రతినిధుల ను కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు.

**దేవాలయాల్లో ప్రత్యేకంగా మొక్కలు నాటాలి**
దేవాలయాలకు ప్రత్యేక ప్రాధాన్యత కలిగిన వృక్ష జాతులను గుర్తించి, ఆయా చెట్ల మొక్కలను సేకరించి దేవాలయ ప్రాంగణాల్లో నాటాలని మంత్రి సూచించారు. దీనివల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు సంప్రదాయంగా ప్రాధాన్యత కలిగిన వృక్ష జాతులను సంరక్షించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

**ఆరోగ్యకరమైన, నాణ్యమైన మొక్కల పంపిణీ**
అన్ని నర్సరీల్లో తగినంత మొక్కలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలకు ఆరోగ్యకరమైన, నాణ్యమైన మొక్కలను మాత్రమే పంపిణీ చేసి నాటించాలని అధికారులను ఆదేశించారు. మొక్కల సేకరణ, రవాణా, గుంతల ఏర్పాటు, నాటడం, అనంతరం నీటి వసతి కల్పించడం వంటి అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.

**పట్టణ ప్రాంతాల్లో అర్బన్ ఫారెస్టులకు ప్రాధాన్యత**
పట్టణ ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంచేందుకు అర్బన్ ఫారెస్టుల ఏర్పాటును ప్రోత్సహించాలని మంత్రి సూచించారు. మున్సిపాలిటీల పరిధిలో ప్రజల భాగస్వామ్యంతో పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టి పట్టణాల్లో పచ్చదనాన్ని మరింత పెంచాలని ఆదేశించారు.

**చెరువుల పరిసరాల్లో తాటి మొక్కల పెంపకం**
తాటి మొక్కలను చెరువుల పరిసర ప్రాంతాల్లో, అలాగే గౌడ సమాజానికి చెందిన భూముల్లో నాటేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

**భూగర్భ జలాల పెంపుపై ప్రత్యేక దృష్టి**
ఈ సీజన్‌లో తక్కువ వర్షపాతం నమోదైన నేపథ్యంలో మొక్కల పెంపకంతో పాటు భూగర్భ జలాల పెంపుపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి తెలిపారు. నీటి సంరక్షణకు అనువైన ప్రాంతాలను గుర్తించి, అక్కడ నీటి నిల్వ మరియు భూగర్భ జలాల పెంపునకు అవసరమైన గుంతలు, ఇతర చర్యలు చేపట్టాలని సూచించారు.
ఈ నెల 25న నిర్వహించనున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, మొక్కల సేకరణ, రవాణా, గుంతల ఏర్పాటు, మొక్కలు నాటడం, నీటి సదుపాయం తదితర ఏర్పాట్లను పూర్తిచేసి కార్యక్రమాన్ని పెద్దఎత్తున విజయవంతం చేయాలని మంత్రి ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్ లో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కే.కిరణ్మయి, జిల్లా అటవీ అధికారి (ఇన్ఛీఫ్) శివ ఆశిష్ సింగ్, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి,డిపిఓ సురేష్ మోహన్, పరిశ్రమల శాఖ అధికారి శ్రీలక్ష్మి, డి.ఈ.ఓ వెంకటేశ్వర్లు, వ్యవసాయ శాఖ అధికారి సుజాత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# యువత ఆరోగ్యంపై దృష్టి సారించాలి..

**మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్.. -గచ్చిబౌలిలో గెట్ ఫిట్ జోన్నూతన జిమ్ ప్రారంభోత్సవం**

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
యువత ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సూచించారు. గచ్చిబౌలిలో షాద్‌నగర్ పట్టణానికి చెందిన యువకులు ఏర్పాటు చేసిన గెట్ ఫిట్ జోన్‌జిమ్ ప్రారంభంనూతన జిమ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ, నిత్యం వ్యాయామం చేయడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రీడలు, వ్యాయామం వంటి ఆరోగ్యకరమైన కార్యక్రమాలపై దృష్టి సారించాలని



సూచించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి వ్యాయామం ఎంతో అవసరమన్నారు ఫిట్‌నెస్ ను రోజువారీ జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. యువతకు ఉపయోగపడే విధంగా జిమ్ ఏర్పాటు చేయడం అభినందనీయమని, నిర్వాహకులు అసిఫ్ తదితరులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్,మాజీ మున్సిపల్ చైర్మన్ లావణ్య దేవేందర్ యాదవ్,మాజీ పీఎసీఎస్ చైర్మన్ విఠల్,సర్పంచ్ జెట్ట కుమార్, మాజీ సర్పంచ్ బండి రాజు, జిమ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# ధరాఘాతంపై సమీక్షించని పాలకులు

**ఆగస్టు 24.ఆగస్టు 24(ప్రజావినికడి):**
పాలక పార్టీలకు రాజకీయాలు తప్ప ప్రజల సమస్యలు పట్టడం లేదు. ఓట్లకోసం పథకాలను తీసుకుని వెళ్లడం, మధ్యతరగతి ప్రజలపై భారం మోపం తప్ప కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరు మారడం లేదు. రాజకీయ పార్టీలు కూడా ఉచిత హామీలపై పాలక పార్టీలను నిలదీయడం తప్ప, ధరలఅపై ధర్నాలు చేసిన సందర్భాలు కనిపించడం లేదు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెవలడమెలా అన్న ప్రణాళికలు సిద్ధం చేసుకుంటు న్నారు. ఇందుకు అధికారంలో ఉన్న ఏ పార్టీ కూడా మినహాయింపు కాదు. కేంద్రంలోని బిజెపి నేతృత్వం లోని ఎన్‌డిఎ తీరు కూడా అదే విధంగా ఉంది. తాము చేసిందే పాలన అన్న విధంగా ప్రచారం చేసుకుంటు న్నాయి. నిత్యావసర ధరలు మొదలు, సిమెంట్, విమానయాన ధరుల అందనంత ఎత్తుకు పోతున్నాయి. దీంతో పేద మధ్యతరగతి ప్రజలు నకరయాతన పడుతున్నారు. ఒకటని లేకుండా క్రమంగా ధరలు పెంచే స్తున్నారు. చక్కెర, బెల్లం, పూలు, పండ్లు.. ఇలా ప్రతి వస్తువు ధర అమాంతం పెరిగిపోతోంది. ఎల్‌నినో బూచి చూపి ఫైన్ రైస్ రకం బియ్యం అమాంతంగా పెంచేశారు. కిలో 80 రూపాయాలకు బియ్యం ధరలు ఎగబాకాయి. బహిరంగ మార్కెట్లో సన్నరకాల ధాన్యం లభ్యత తగ్గడం..కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు వంటి ఇతర రాష్ట్రాల నుంచి డిమాండ్ పెరగడం, సరఫరా వ్యవస్థలో ఒత్తిడి.. ధరల పెరుగుదలకు కారణాలని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మరోవైపు పౌరసరఫరాల సంస్థ అవసరాలకు మించి సేకరించిన ధాన్యం సుమారు 20 లక్షల టన్నుల వరకు ఉండగా..అందులో అధిక మొత్తంలో సన్నాలే ఉన్నాయి. ఈ వడ్లను వేలంలో అమ్మే ప్రక్రియకు స్పందన రాకపోవడంతో సరకంతా మిల్లర్లు, గోదాముల దగ్గరే ఉండటం కూడా మరో కారణమని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. చింతపండు రెండువందలకు పైనే పెరిగింది, చక్కర ధరలు కూడా మెల్లగా పెంచుతూ.. అనూహ్యంగా పెరిగాయి. అందరూ ఫ్రీ దయాబిటిక్ కనుక వీటి ధరలు పెరిగినా ఫర్వాలేదని బీహార్‌కు చెందిన ఓ మంత్రి ఎకసక్కెంగా మాట్లాడారు. నిజానికి పాలకులు చేస్తున్న దుబారా ఖర్చులకు మాత్రం కళ్లెం పడడం లేదు. ఇలా చెప్పుకుంటూ పోతే ఒక్కటేంటి వంటకు,పూజలకు ,పెళ్ళిల్ల వరకు అవసరమయ్యే అన్ని వస్తువుల ధరలు భగ్గుమంటున్నాయి. ఉల్లిగడ్డ నెలరోజుల్లోనే దాదాపు రెట్టింపైంది. జులై నాలుగో వారంలో కిలో రూ.22-26 ఉంటే.. ఇప్పుడు రూ.45-52కి చేరింది. జూన్ మొదటి వారంతో పోలిస్తే వెల్లుల్లి కిలో ధర రూ.120-130 నుంచి రూ.250 అంటే దాదాపు వంద శాతం వరకు పెరిగింది. ఎండుమిర్చి రూ.240 నుంచి రూ.300కి చేరింది. వంటనూనెల ధరలు కూడా భగ్గుమంటున్నాయి. లీటర్ నూనె ప్యాకెట్ 175కు చేరింది. బెల్లం కేజీకి రూ.55 నుంచి రూ.70-75కి పెరిగింది. పండగలు, శుభాకార్యాల్లో పిండివంటలు తప్పనిసరైన నేపథ్యంలో ఇది మరో భారమైంది. ఇక పెళ్లిళ్లు.. బోనాలు, శ్రావణమాస పూజల నేపథ్యంలో పూలకు గిరాకీ



ఏర్పడగా..వ్యాపారులు దాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. బోనాలు ఒక్కో ప్రాంతంలో ఒక్కోసారి జరుగుతుండటంతో ఆ సమయాల్లో ప్రాంతాల వారీగా పెంచేస్తు న్నారు. బంగారం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కనీసం పుస్తెలు చేయించే పరిస్తితి కూడా లేకుండా పోతోంది. బంగారనం ధరల మాఫియా ప్రపంచాన్ని శాసిస్తోంది. బంగారం షాపుల వారు కల్తీల, తరుగు, జిఎస్టీ పేరుతో దోచేస్తున్నారు. పెళ్లి బడ్జెట్‌లో బంగారం పెద్ద భాగం. పెరిగిన ధరలతో మంగళసూత్రం సహా ఆభరణాల కొనుగోలు ఖర్చు తలచుకుంటేనే భయమేస్తోందని పెళ్లిళ్లు చేసే కుటుంబాలు ఆవేదన వ్యక్తంచేస్తున్నాయి. ఇక నిత్యం వాడుకునే ఉల్లిగడ్డ ధరలు కూడా అనూహ్యంగా పెరిగాయి. కిలో 45కు తక్కువగా అమ్మడం లేదు. ఇదే కోవలో ఎండుమిర్చి, వెల్లుల్లి ధరలు కూడా భయపెడుతున్నాయి. ఇలా చెప్పకుంటూ పోతే ధరల జాబితా చాంతాండంత తయార వుతోంది. ఇక ఇల్లు కట్టుకునాలనుకునే వారికి
సిమెంటు,స్టీలు, ఇటుక, ఇసుక ధరలు చిర్రెత్తిస్తున్నాయి. ఇకపోతే మందుల ధరలు, ఆస్పత్రుల ఖర్చులు చెప్పాల్సిన పనిలేదు. ఇవన్నీ ఒక ఎత్తయితే నిత్యావసర ధరల పెరుగుదల కారణంగా సామాన్యుడి నెలవారీ ఇంటి ఖర్చు అమాంతంగా పెరగడంతో తలపట్టుకునే పరిస్థితి వచ్చింది. అయితే ఉత్పత్తి తగ్గడం, సరఫరా ప్రభావం వంటికారణాలతో వ్యాపారులు రోజుకో లెక్క చెబుతున్నారు. ఇలా ధరలు పెరుగుతున్నా కేంద్ర రాష్ట్రాలు సమీక్షించడం లేదు. ధరల అదుపునకు చర్యలు తీసుకోవడం లేదు. వ్యాపారులను నిలదీయడం లేదు. జనాభాకు తగ్గట్లుగా పంటుల పండుతున్నాయా లేదా అన్నది చూడడం లేదు. దేశంలో ఏయే పంటలు ఎంత పండుతున్నాయి..ఎంతెంత నిల్వలు ఉంటున్నాయో లెక్కలు వేయడం లేదు. ఏ సరుకు ఎక్కడి నుంచి ఎక్కడికి పోతేందో గమనించడం లేదు. బ్లాక్ మార్కెటీర్లను అదుపు చేయడం లేదు. ఇక విమాన ప్రయాణాన్ని సామాన్యులకు చేరువ చేస్తామిన గొప్పులు చెబుతున్న మోడీ సర్కార్ విమాన ధరలను గమనించడం లేదు. విమాన సంస్థలు మూతపడుతున్నా పట్టించుకోవడం లేదు. ఇలాంటి వారంతా పాలకులుగా ప్రజలకు ఏం సందేశం ఇస్తారో చెప్పాలి. నిరసనలు చేసేవారు ధరల పెరుగుదలపై నిలదీయాలే తప్ప రాజకీయ ప్రయోజానాల కోసం కాదు. విపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తన బాధ్యతను పూర్తిగా విస్మరించింది. పార్లమెంట్ సమావేశాలను కేవలం ఆందోళనతో భ్రష్టు పట్టించింది. ఇది కూడా ప్రజలపై భారం మోపే చర్య తప్ప మరోటి కాదు. ఇవన్నీ కూడా ప్రజలు గమనించాలి. ప్రజాప్రతినిదులు వచ్చినప్పుడు ప్రతే నిలదీయాలి. అప్పుడైనా చలనం వస్తుందేమో చూడాలి.

# ఆయుధాలు సమకూర్చుకుంటున్న పాకిస్థాన్

**ఇస్లామిక్ కూటమితో బలోపేతం అయ్యేలా ప్రణాళికలు**

**టర్కీ నుంచి ఆయుధాలు సేకరిస్తున్నట్లు అనుమానాలు**

**మక్కా ఒప్పందలోకి ఇరాన్‌కు ఆహ్వానం**

**న్యూఢిల్లీ,ఆగస్టు 24.(ప్రజావినికడి):**
ఆపరేషన్ సిందూర్ తరవాత పాకిస్తాన్ తీరు అనుమానాస్పదంగా ఉంది. అంతర్జాతీయంగా ఇస్లామిక్ కూటమితో బలోపేతం అయ్యేందుకు చేస్తున్న ప్రయత్నాలు కూడా అనుమానాలు కలిగిస్తున్నాయి. మొత్తంగా పాకిస్తాన్ ఏదో భారీగా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అంతర్గతంగా ఉన్న సమస్యల్ని పక్కదారి పట్టించేందుకు భారత్‌పై యుద్ధం చేయాలని భావిస్తుందా. ..అనే అనుమానాలు కలుగుతున్నాయి. పాకిస్తాన్ టర్కీ నుంచి భారీగా ఆయుధాలు దిగుమతి చేసుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. పాకిస్తాన్‌లో కీలక వైమానిక స్థావరమైన నూర్ ఖాన్ ఎయిర్ బేస్‌కు టర్కీ సైనిక విమానాల రాకపోకలు పెరిగినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా సీ-130 హెర్క్యులెస్ విమానాలు రావల్పిండిలోని నూర్ ఖాన్, కరాచీలోని మసూర్ వైమానిక స్థావరాలకు వచ్చినట్లు తెలుస్తోంది.ఆగస్టు 19 నుంచి 21 వరకు టర్కీకి చెందిన ఎ-130 విమానాలు పాకిస్తాన్‌కు వచ్చి వెళ్లాయి. దీనిని భారత నిఘా వర్గాలు అసాధారణ పరిణామంగా గుర్తించింది. ఈ విమానాల ద్వారా పాకిస్తాన్ డ్రోన్లు, డ్రోన్ సంబంధిత పరికరాలు, ఇతర సైనిక సామాగ్రి తరలించి ఉండొచ్చని నివేదికలు సూచిస్తున్నాయి. ఇదే కాకుండా చైనా నుంచి కూడా భారీగా ఆయుధాల దిగుమతి జరుగుతోందని తెలుస్తోంది. ముఖ్యంగా పాకిస్తాన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ పొందిందనే వాదన కూడా ఉంది. అయితే, ఈ ఆయుధాలు లేదా డ్రోన్ల సరఫరాపై పాకిస్తాన్ లేదా టర్కీ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ధృవీకరణ రాలేదు. అయితే, టర్కీ డ్రోన్లపై పాక్




ఎప్పటి నుంచో ఆసక్తి చూపిస్తోంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్ టర్కీ డ్రోన్లను భారత్‌పై వాడింది. వీటన్నింటిని భారత్ సమర్థవంతంగా తిప్పికొట్టింది. ఇప్పటికే బైరక్టర్ టీబీ2 డ్రోన్లు పాక్ వద్ద ఉన్నాయి. గతంలో భారత్ తో సైనిక ఘర్షణ సమయంలో టర్కీ తన డ్రోన్ ఆపరేటర్లను కూడా పాకిస్తాన్‌లో మోహరించింది. ప్రస్తుతం పాక్ తన మానవరహిత వైమానిక సామర్థ్యాలను పెంచుకునే ప్రయత్నం చేస్తోంది. ముఖ్యంగా ఎక్కువసేపు గాల్లో ఉండగల డ్రోన్లు, లాయిటరింగ్ మ్యునిషన్ వంటి వ్యవస్థల్ని సమకూర్చుకుంటోంది. మరోఇవైపు పశ్చిమాసియాలో ఘర్షణల వేళ పాకిస్థాన్, సౌదీ అరేబియా, తుర్కియే 'మక్కా సమష్టి రక్షణ ఒప్పందం' కుదుర్చుకున్నాయి. ఇంకా పలు దేశాలు ఈ మక్కా ఒప్పందం లోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నాయి. ఇలాంటి తరుణంలో కీలక పరిణామం చోటుచేసుకున్నట్లు కనిపిస్తోంది. ఈ ఒప్పందంలో చేరాలని ఇరాన్ కు ఆహ్వానం అందినట్లు తెలుస్తోంది. తమకు అందిన ఆహ్వానం పై సమీక్ష జరుపుతున్నామని, ఇది టెహ్రాన్‌కు దక్కిన విజయమని ఇరాన్ కీలకనేత మెహ్దీ రహీమి పేర్కొన్నట్లు పశ్చిమాసియాలోని మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే ఇరాన్ విదేశాంగశాఖ ఈ ఆహ్వానాన్ని ధ్రువీకరించాల్సి ఉంది. సౌదీ అరేబియాకు ఇరాన్ అనుబంధ గ్రూప్ హూతీలకు మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొంది. అలాంటప్పుడు ఇరాన్‌కు ఈ ఆహ్వానం వెళ్లి ఉంటుందా..? అనే ప్రశ్నలు తలెత్తున్నాయి. అణ్వస్త్ర దేశమైన పాకిస్థాన్, నాటో సభ్య దేశమైన తుర్కియే, చమురు నిల్వలతో సుసంపన్నమైన సౌదీ అరేబియా మధ్య జరిగిన సంయుక్త రక్షణ ఒప్పందం ప్రపంచవ్యాప్తంగా చర్చల్లో నిలిచింది. నాటో కూటమి మాదిరిగానే 'సభ్య దేశాల్లో ఏ ఒక్కదానిపై దాడి జరిగినా అది తమందరిపై జరిగిన దాడిగా మిగిలినవి భావిస్తాయి' అనే నిబంధనను ఈ ఒప్పందంలో చేర్చారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇరాన్-ఇజ్రాయెల్-అమెరికా యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి మొత్తం పశ్చిమాసియాలో అనూహ్య మార్పులు వస్తున్నాయి. ఈ ప్రాంత దేశాలు అమెరికా రక్షణ ఛత్రం నుంచి క్రమంగా బయటకు రావాలని చూస్తున్నట్లు కనిపిస్తోంది. అయితే ఇరాన్ ఈ ఒప్పందంలో చేరితే.. హూతీలపైనే దాడులు చేయాల్సి ఉంటుంది. అందుకే ఈ ఆహ్వానం ఏమేరకు ఫలిస్తుందో చూడాలి.

# వెంటిలేటర్ పేలి ఆస్పత్రిలో అగ్నిప్రమాదం

**ముగ్గురు నవజాత శిశువుల మృతి**

**ముంబై,ఆగస్టు 24.(ప్రజావినికడి):**
మహారాష్ట్రలోని అమరావతిలో సోమవారం తెల్లవారుజామున ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. అమరావతి జిల్లా మహిళా ఆస్పత్రిలో మంటలు చెలరేగి ముగ్గురు నవజాత శిశువులు మృతిచెందగా.. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రి మూడో అంతస్తులోని ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ విభాగంలో 39 మంది చిన్నారులు చికిత్స పొందుతున్నారు. అయితే, తెల్లవారుజామున 3:30 గంటల ప్రాంతంలో వెంటిలేటర్ ఒక్కసారిగా పేలడంతో మంటలు చెలరేగాయి.నిమిషాల్లో ఎల్ఎన్సీయూ మొత్తం వ్యాపించాయి. దీంతో పొగ పీల్చడం, తీవ్రమైన కాలిన గాయాలు కారణంగా ముగ్గురు శిశువులు ప్రాణాలు కోల్పోయారు. అగ్నిప్రమాదం జరిగిన వెంటనే వైద్యులు, నర్సులు, ఇతర ఆస్పత్రి సిబ్బంది వార్డుకు చేరుకుని చిన్నారులను కాపాడారు. తీవ్రంగా గాయపడిన ఆరుగురు నవజాత శిశువులను చికిత్స నిమిత్తం సమీపంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. కాగా, ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం రేపుతోంది.

--------

# హర్యానాలో భర్తను చంపి పేగులూడదీసిన భార్య

**చండీఘడ్,ఆగస్టు 24.(ప్రజావినికడి):**హర్యానాలోని కురుక్షేత్రలో జరిగిన ఒక దిగ్భ్రాంతికర హత్య కేసు వెలుగులోకి వచ్చింది. ఒక మహిళ తన భర్తను చంపి, అతడి పేగులు బయటకు తీసి దారుణానికి పాల్పడింది. ఆ తర్వాత ఇంటి యజమాని చూశాడనే భయంతో భయాందోళనకు గురై ఇంటి పైకప్పు మీది నుంచి కిందకు దూకేసింది. ప్రస్తుతం ఆమె హాస్పిటల్‌లో చికిత్స పొందుతోంది. కురుక్షేత్రలోని పెహోవా రోడ్డులో ఉన్న రాజ్ ప్యాలెస్ సమీపంలో రాజేష్, విమలా దేవి ఓ అ÷-దదె ఇంట్లో నివసిస్తున్నారు. ఇటీవల రాజేష్, విమలా దేవి ఏదో విషయమై గొడవపడ్డారు. ఆ గందరగోళాన్ని విని ఇంటి యజమాని రింకు డాబా మీదకు పరుగెత్తాడు. అక్కడ అతడు చూసిన దృశ్యం అచ్చం క్రైమ్ సినిమాలోని సన్నివేశంలా ఉంది. రాజేష్ రక్తపు మడుగులో పడి ఉన్నాడు. అతడి శరీరం నుంచి బయటకు వచ్చిన పేగులను విమల ఒక సంచిలో పెడుతోంది. ఇంటి యజమానిని చూడగానే ఆ మహిళ భయాందోళనకు గురైంది. వెంటనే టెర్రస్ పై నుంచి కిందకు దూకేసింది. గాయపడిన నిందితురాలిని ఆసుపత్రిలో చేర్చారు. ప్రస్తుతం ఆమెకు చికిత్స జరుగుతోంది. పోలీసులు ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. పదునైన ఆయుధాలతో రాజేష్ పొట్టను సుమారు 35 సెంటీమీటర్ల మేర కోసి, లోతైన గాయాలు చేసినట్లు పోస్ట్‌మార్టంలో తెలిసింది. ఘటనా స్థలం నుంచి మూడు కత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

------

# మహిళలకు తమిళ సిఎం విజయ్ వరాలు

**ఏడాదికి మూడు ఉచిత సిలిండర్ల ప్రకటన**


**ట్రాన్స్ జెండర్లకు కూడా ఉచిత బస్సు సౌకర్యం**

**చెన్నై,ఆగస్టు 24.(ప్రజావినికడి):**తమిళనాడు అసెంబ్లీ వేదికగా మహిళలపై ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ వరాల జల్లు కురిపించారు. ఎన్నికల హామీ మేరకు సోమవారం పలు సంక్షేమ పథకాలను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా అర్హులైన ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత ఎల్‌పీజీ సిలిండర్లు అందించనున్నట్లు సీఎం విజయ్ ప్రకటించారు. 'అన్నపూర్ణి సూపర్ సిక్స్' పథకం కింద దీనిని అమలు చేయనున్నట్లు సీఎం విజయ్ పేర్కొన్నారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు నేరుగా జమ అయ్యేలా పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ ఉచిత ఎల్‌పీజీ సిలిండర్ల పథకాన్ని వచ్చే ఏడాది పొంగల్ పండుగ నుంచి అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ పథకం కింద సుమారు 1.30 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. అలాగే రాష్ట్ర ఖజానాపై ఏడాదికి సుమారు రూ.4,000 కోట్ల వ్యయం పడనుంది. మహిళలు, ట్రాన్స్‌జెండర్ల కోసం ఉచిత బస్సు ప్రయాణాన్ని మరింత విస్తరిస్తూ 'వెట్రి పయన తిట్టం' పథకాన్నీ సీఎం విజయ్ ప్రకటించారు. ఈ పథకం ద్వారా ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రకటించడంతో పాటు మహిళల కోసం దీని పరిధిని విస్తరించారు. ఇకపై ఎక్స్‌ప్రెస్, లిమిటెడ్ స్టాప్ సర్వీస్, డీలక్స్ సర్వీసుల బస్సుల్లోనూ మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించనున్నారు. ఉచిత ప్రయాణం పొందేందుకు ఆదాయ పరిమితి, ప్రయాణాల సంఖ్యపై ఎలాంటి నిబంధనలు ఉండవని సీఎం స్పష్టం చేశారు. కాగా, గాంధీ జయంతి రోజైన అక్టోబర్ 2 నుంచి ఈ పథకం అమల్లోకి రానుందని తెలిపారు. అలాగే, అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ మరో సంచలన నిర్ణయం ప్రకటించారు. చెన్నై శివార్లలోని పరందూర్‌లో రెండో విమానాశ్రయం నిర్మించాలన్న ప్రతిపాదనను తమ ప్రభుత్వం విరమించుకుంటున్నట్లు తెలిపారు. విమానాశ్రయాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేస్తున్న వారికి తన మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. 'పరందూర్ విమానాశ్రయ ప్రాజెక్టును విరమించుకుంటున్నాం. ప్రతిపాదిత విమానాశ్రయానికి వ్యతిరేకంగా పోరాడుతున్న నిరసనకారులకు నేను అండగా ఉంటా' అని విజయ్ పేర్కొన్నారు.


# తిరుమలలో కొనసాగుతున్న రద్దీ

**పవిత్రోత్సవాలతో మరింత వైభవంగా తిరుమల**

**తిరుమల,ఆగస్టు 24.(ప్రజావినికడి):**
తిరుమలలో రద్దీ కొనసాగుతోంది. మరోవైపు శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు పవిత్ర ప్రతిష్ట నిర్వహించారు.ఈ సందర్భంగా ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారిని పవిత్ర మండపంలోని యాగశాలకు వేంచేపు చేశారు. అక్కడ హోమాలు తదితర వైదిక కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం సంపంగి ప్రాకారంలో వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. ఈ సందర్భంగా వేద పండితులు పంచసూక్తాలను



పఠించారు. ఆ తర్వాత పవిత్ర ప్రతిష్ట జరిగింది. మధ్యాహ్నం స్వామి, అమ్మవార్లకు విశేష సమర్పణ చేశారు. అనంతరం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి యాగశాలలో వైదిక కార్యక్రమాలు



నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, టీటీడీ బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పంత్ సరికొత్త చరిత్ర..

భారత స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ మరో అరుదైన చారిత్రాత్మక రికార్డును సాధించాడు. విదేశాల్లో లేదా న్యూట్రల్ వేదికల్లో జరిగిన టెస్టుల్లో భారత వికెట్ కీపర్‌గా అత్యధిక పరుగులు సాధించిన లెజెండరీ క్రికెటర్ ఎంఎస్ ధోనీ పేరిట ఉన్న ఆల్ టైమ్ రికార్డును పంత్ బ్రేక్ చేశాడు. కొలంబో వేదికగా శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్ట్ రెండో రోజు ఆటలో పంత్ ఈ ఘనతను నమోదు చేశాడు. ఈ విభాగంలో 2500 పరుగుల మార్కును దాటిన పంత్, ధోనీ సాధించిన 2496 పరుగుల రికార్డును అధిగమించి అగ్రస్థానంలో నిలిచాడు. ధోనీ 32.84 సగటుతో ఆ పరుగులు చేయగా, పంత్ దాదాపు 42 సగటుతో ఈ మైలురాయిని అందుకోవడం గమనార్హం. ఈ లిస్టులో ఫరూక్ ఇంజనీర్ (1209 రన్స్), సయ్యద్ కిర్మాణి (1109 రన్స్), కిరణ్ మోరే (901 రన్స్) తర్వాతి స్థానాల్లో నిలిచారు.. ఈ రికార్డు నమోదు కావడానికి ఒక రోజు ముందు పంత్ మైదానంలో తీవ్ర గాయానికి లోనయ్యాడు. మొదటి రోజు ఆట మూడో సెషన్‌లో శ్రీలంక పేసర్ లహిరు కుమార వేసిన షార్ట్ పిచ్ బంతిని పుల్ చేసే క్రమంలో పంత్ ఎడమ చేతి మణికట్టుకు గాయం అయింది. నొప్పితో విలవిల్లాడిన పంత్ కు భారత జట్టు ఫిజియో ఐస్ ప్యాక్ పెట్టి కట్టు కట్టినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ తీవ్ర అసౌకర్యంగా అనిపించడంతో 15 బంతుల్లో 3 పరుగులు చేసిన తర్వాత 58వ ఓవర్లో పంత్ రిటైర్డ్ హర్ట్ గా వెనుదిరిగాడు. గాయం తీవ్రత భయపెట్టినప్పటికీ, రెండో రోజు ఉదయం భారత్ ఆరో వికెట్ కోల్పోయిన తర్వాత పంత్ తిరిగి బ్యాటింగ్ కు వచ్చాడు. అసిథ ఫెర్నాండో, ఇతర లంక పేసర్లు వరుసగా బౌన్సర్లతో దాడి చేస్తూ అతడి భుజానికి కూడా బంతులు తాకించినా పంత్ ఏమాత్రం లెక్క చేయలేదు. నొప్పిని భరిస్తూనే మరో వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ తో కలిసి జట్టు ఇన్నింగ్స్ ను ముందుకు నడిపించాడు. ఇద్దరూ కలిసి సమయోచిత భాగస్వామ్యంతో లంక బౌలర్లను దీటుగా ఎదుర్కొని స్కోరు బోర్డును ముందుకు తీసుకెళ్లారు. శ్రీలంక బౌలర్లు తీవ్రంగా ఒత్తిడి తెస్తున్న సమయంలో పంత్ చూపిన అంకితభావం జట్టుకు కొండంత బలాన్ని ఇచ్చిందనడంలో సందేహం లేదు. ఇక వీళ్లిద్దరూ సాధికారికంగా



బ్యాటింగ్ చేస్తూ, అబేధ్యమైన ఏడో వికెట్ కు 112 పరుగులు జోడించారు. లంచ్ విరామ సమయానికి టీమిండియా 112 ఓవర్లలో 6 వికెట్లకు 419 పరుగులు చేసింది. పంత్ (63 బ్యాటింగ్)తో పాటు జురేల్ (59 బ్యాటింగ్) అర్ధ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. ఫెర్నాండోకు నాలుగు వికెట్లు దక్కాయి. ఇప్పటికే గాలే టెస్ట్ లో భారత్ 165 రన్స్ తో గెలిచి సిరీస్ లో 1-0 లీడ్ లో ఉండగా, కొలంబోలోనూ పంత్ పోరాటంతో జట్టు పటిష్ట స్థితికి చేరింది.

# భారీ స్కోర్ వద్ద భారత్ డిక్లేర్డ్!

## ● ధ్రువ్ జురెల్ అజేయ శతకం

శ్రీలంకతో రెండో టెస్ట్‌లో టీమిండియా భారీ స్కోర్ చేసింది. ధ్రువ్ జురెల్(177 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లతో 115 నాటౌట్) అజేయ శతకంతో చెలరేగడంతో తొలి ఇన్నింగ్స్‌ను భారత్ 503/9 భారీ స్కోర్ వద్ద డిక్లేర్డ్ చేసింది. రిషభ్ పంత్(89 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 63) హాఫ్ సెంచరీతో రాణించాడు. తొలి రోజు ఆటలో దేవదత్ పడిక్కల్(193 బంతుల్లో 12 ఫోర్లతో 117) సెంచరీతో చెలరేగగా.. శుభ్‌మన్ గిల్(108 బంతుల్లో 6 ఫోర్లతో 50) హాఫ్ సెంచరీతో రాణించిన సంగతి తెలిసిందే. శ్రీలంక బౌలర్లలో అసితా ఫెర్నాండో(4/106) నాలుగు వికెట్లు తీయగా..ప్రభాత్ జయసూర్య కేశర నువాంత్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. లాహిరు కుమారాకు ఒక వికెట్ దక్కింది. అనంతరం శ్రీలంక బ్యాటింగ్‌కు దిగగా 2 బంతులు పడగానే వర్షం అంతరాయం కలిగించింది. ఆ తర్వాత ఆట తిరిగి ప్రారంభం కాగా.. శ్రీలంక 3 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 8 పరుగులు చేసింది. లాహిరు ఉడారా(1) ప్రసిధ్ కృష్ణ ఔట్ చేయగా.. ప్రభాత్ జయసూర్య(2)ను మానవ్ సుతార్ పెవిలియన్ చేర్చాడు. వర్షం కారణంగా రెండో రోజు 56 ఓవర్ల ఆటనే సాధ్యమైంది. 300/5 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను కొనసాగించిన భారత్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. ఓవర్‌నైట్ బ్యాటర్ సారాన్ష్ జైన్(6) రెండు పరుగులు మాత్రమే చేసి అసితా ఫెర్నాండో బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేరాడు. దాంతో తొలి రోజు ఆటలో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన రిషభ్ పంత్ మళ్లీ బ్యాటింగ్‌కు దిగాడు. ధ్రువ్ జురెల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. తనదైన శైలిలో చెలరేగిన ఈ జోడీ వేగంగా పరుగులు రాబట్టింది. ముఖ్యంగా పంత్ భారీ షాట్లతో లంకబౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఈ క్రమంలో పంత్ 81 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకోగా.. ధ్రువ్ జురెల్ 97 బంతుల్లో అర్ధశతకం సాధించాడు. దాంతో భారత్ 419/6 స్కోర్ వద్ద లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్‌లో పంత్ దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. భారీ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. అయితే అతన్ని కుశార నువాంత క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో ఏడో వికెట్‌కు నమోదైన 112



పరుగుల భారీ భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులోకి మానవ్ సుతార్ రాగా.. ధ్రువ్ జురెల్ తన జోరును కొనసాగించాడు. ఆచితూచిన ఆడిన మానవ్ సుతార్(18)ను ప్రబాత్ జయసూర్య కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చగా.. సిరాజ్‌తో కలిసి ధ్రువ్ జురెల్ రెండో సెషన్‌ను ముగించాడు. వర్షం కారణంగా కాస్త ముందుగానే ఈ సెషన్ ముగిసింది. ఆఖరి సెషన్‌లో దూకుడుగా ఆడిన ధ్రువ్ జురెల్ 171 బంతుల్లో సెంచరీ మార్క్ అందుకున్నాడు. ఆ వెంటనే భారీ సిక్సర్‌తో ధ్రువ్ జురెల్ తన జోరు కనబర్చగా.. సిరాజ్(3) ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. దూకుడుగా ఆడిన ధ్రువ్ జురెల్ వేగంగా పరుగులు రాబట్టి జట్టు స్కోర్‌ను 500 ధాటించాడు. ఆ వెంటనే భారత్ తమ ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది.

# యశస్వి జైస్వాల్‌కు భారీ ఊరట!

టీమిండియా ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు భారీ ఊరట లభించింది. శ్రీలంక ప్లేయర్ అసిత ఫెర్నాండోతో గొడవ పడిన ఘటనలో ఐసీసీ జరిమానాతో సరిపెట్టింది. యశస్వి జైస్వాల్‌తో పాటు అసిత ఫెర్నాండో మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించడంతో పాటు ఒక డీమెరిట్ పాయింట్ కేటాయించింది. ఈ ఘటనలో యశస్వి జైస్వాల్‌దే తప్పంటూ మాజీ క్రికెటర్లు, కామెంటేటర్లు తీర్పు ఇచ్చారు. దాంతో యశస్వి జైస్వాల్‌పై నిషేధం పడుతుందని అంతా అనుకున్నారు. కానీ మ్యాచ్ రిఫరీ లెవెల్-1 నేరంగా పరిగణించి రూల్స్ ప్రకారం చర్యలు తీసుకున్నారు.

ఈ చర్యలకు సంబంధించి ఐసీసీ ఓ ప్రకటనను విడుదల చేసింది. 'ఆదివారం కొలంబో వేదికగా మొదలైన రెండో టెస్ట్ తొలి రోజున ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని లెవెల్ 1 రూల్‌ను ఉల్లంఘించిన శ్రీలంక పేసర్ అసితా ఫెర్నాండో, భారత ఓపెనర్ యశస్వి జైస్వాల్‌ల మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధిస్తూ మ్యాచ్ రిఫరీ చర్యలు తీసుకున్నారు. ఆర్టికల్ 2.12 ప్రకారం ఒక ప్లేయర్, సపోర్ట్ స్టాఫ్, అంపైర్‌తో భౌతిక ఘర్షణకు దిగడం నేరం.మ్యాచ్ ఫీజు కోతతో పాటు చెరో డీ మెరిట్ పాయింట్ కేటాయించారు. తమ తప్పులను ఫెర్నాండో, జైస్వాల్ అంగీకరించారు. దాంతో అధికారిక విచారణ అవసరం లేకుండానే ఈ శిక్షలు ఖరారు చేస్తున్నాం. లెవెల్ 1 ఉల్లంఘనకు పాల్పడినప్పుడు కనీస శిక్షగా హెచ్చరిక, గరిష్టంగా ఆటగాడి మ్యాచ్ ఫీజులో 50 శాతం, ఒకటి లేదా



రెండు డీమెరిట్ పాయింట్స్ ఉంటాయి.'అని ఐసీసీ తమ ప్రకటనలో పేర్కొంది. కొలంబో వేదికగా ఆదివారం ప్రారంభమైన రెండో టెస్ట్‌లో యశస్వి జైస్వాల్ దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. అసిత ఫెర్నాండో వేసిన ఒకే ఓవర్లో వరుసగా మూడు ఫోర్లు బాదాడు. ఆ తర్వాత ఫెర్నాండో ఒక అద్భుతమైన డెలివరీతో జైస్వాల్‌ను 45 పరుగుల వద్ద క్లీన్ బౌల్డ్ చేశాడు. వికెట్ తీసిన అనంతరం ఫెర్నాండో అత్యుత్సాహంగా సెలెబ్రేట్ చేసుకున్నాడు. ఈ క్రమంలో అతను ఏదో మాట అన్నాడు. అది విన్న జైస్వాల్ ఆగ్రహంతో అతనిపైకి దూసుకెళ్లాడు. ఒకరికొకరు ఎదురెదురుగా నిలబడి నోరుపారేసుకున్నారు. ఈ క్రమంలో జైస్వాల్ హెల్మెట్ ఫెర్నాండో నుదుటికి తాకింది. దాంతో శ్రీలంక కెప్టెన్ ధనంజయ డిసిల్వా, వైస్ కెప్టెన్ కమిందు మెండిస్ జోక్యం చేసుకొని ఇద్దర్నీ విడదీసాడు.

# సీఎస్‌కే కోచ్‌గా దినేశ్ కార్తీక్‌ను నియమించండి

## ● ఆస్ట్రేలియా దిగ్గజం మాథ్యూ హేడెన్ సూచన



టీమిండియా మాజీ క్రికెటర్ దినేష్ కార్తీక్‌ను చెన్నైసూపర్ కింగ్స్(సీఎస్‌కే) హెడ్ కోచ్‌గా నియమించాలని ఆస్ట్రేలియా దిగ్గజం మాథ్యూ హేడెన్ సూచించాడు. ఐదు సార్లు ఛాంపియన్ అయిన సీఎస్‌కేకు విదేశీ కోచ్‌ల కంటే స్థానిక వ్యక్తులే మెరుగైన సేవలు అందించగలరని మాథ్యూ హేడెన్ అభిప్రాయపడ్డాడు.చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) హెడ్ కోచ్‌గా 18 ఏళ్ల పాటు సేవలందించిన స్టీఫెన్ ఫ్లెమింగ్ ఇటీవలే ఆ బాధ్యతల నుంచి తప్పుకున్న సంగతి తెలిసిందే. అతను ఇంగ్లండ్ టెస్ట్ టీమ్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టగా.. సీఎస్‌కే నయా హెడ్ కోచ్ కోసం అన్వేషణ మొదలుపెట్టింది.తాజాగా ఈ వ్యవహారంపై మాట్లాడిన మాథ్యూ హేడెన్.. స్టీఫెన్ ఫ్లెమింగ్‌ను తప్పించడం సాహోసోపేతమైన నిర్ణయంగా పేర్కొన్నాడు. స్టార్ స్పోర్ట్స్ షోలో మాట్లాడిన మాథ్యూ హేడెన్.. దినేష్ కార్తీక్‌కు హెడ్ కోచ్ పదవి బాధ్యతలు ఇవ్వాలని చెప్పాడు. 'సీఎస్‌కే వంటి పెద్ద జట్టుకు విదేశీ కోచ్ కోచ్ కంటే స్థానిక నేపథ్యం ఉన్న కోచ్ మరింత అనుకూలంగా ఉంటారు. దినేష్ కార్తీక్‌కు చెన్నై క్రికెట్ సంస్కృతి బాగా తెలుసు. కాబట్టి సీఎస్‌కే హెడ్ కోచ్ పదవికి దినేష్ కార్తీక్ సరైన వ్యక్తి. ఐపీఎల్ నుంచి రిటైర్ అయిన తర్వాత దినేశ్ కార్తీక్.. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)కి బ్యాటింగ్ కోచ్, కన్సల్టెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన మార్గదర్శకత్వంలో ఆర్‌సీబీ 2025లో తమ తొలి ఐపీఎల్ టైటిల్‌ను గెలుచుకోవడమే కాకుండా ఐపీఎల్ 2026 సీజన్‌లోనూ టైటిల్ నిలబెట్టుకుంది. సీఎస్‌కే హెడ్ కోచ్ పదవి చేపట్టేందుకు దినేష్ కార్తీక్ సరిగ్గా సరిపోతాడు.'అని మాథ్యూ హేడెన్ చెప్పుకొచ్చాడు. కొత్త కోచ్ ఎంపికపై సీఎస్‌కే ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రటకన చేయలేదు. కానీ పలువురు మాజీ ఆటగాళ్ల పేర్లు ప్రచారంలో ఉన్నాయి.ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ పేరు బలంగా వినిపిస్తోంది. ఫ్లెమింగ్ పర్యవేక్షణలో ఐదు టైటిళ్లు గెలిచిన సీఎస్‌కే.. గత మూడు సీజన్లలో దారుణంగా విఫలమైంది. కనీసం ప్లే ఆఫ్స్ కూడా చేరలేకపోయింది. దాంతోనే అతన్ని సీఎస్‌కే తప్పించింది.

# కుల్దీప్ యాదవ్‌కు నిజంగా వైరల్ ఫీవరే

## స్పష్టం చేసిన బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్

టీమిండియా రిస్ట్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు నిజంగా వైరల్ ఫీవరేనని బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ స్పష్టం చేశాడు. అబద్ధం చెప్పి అతన్ని పక్కన పెట్టాల్సిన అవసరం తమకు లేదన్నాడు. శ్రీలంకతో కొలంబో వేదికగా ఆదివారం ప్రారంభమైన రెండో టెస్ట్‌కు కుల్దీప్ యాదవ్ దూరమైన సంగతి తెలిసిందే.వైరల్ ఫీవర్‌తోనే కుల్దీప్ యాదవ్ దూరమయ్యాడని ఈ మ్యాచ్ ప్రారంభానికి ముందు బీసీసీఐ ఓ ప్రకటనలో పేర్కొంది. 'కుల్దీప్ యాదవ్ తన వైరల్ ఫీవర్ నుంచి పూర్తిగా కోలుకోలేదు. శ్రీలంకతో రెండో టెస్ట్‌కు అతను దూరమయ్యాడు. అవసరమైతే కంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా కుల్దీప్ బరిలోకి దిగగలడు.'అని తెలిపింది.అయితే ఈ ప్రకటనను మెజార్టీ అభిమానులు విశ్వసించలేదు. వైరల్ ఫీవర్ పేరిట కుల్దీప్ యాదవ్‌ను తుది జట్టు నుంచి తప్పించారని ఆరోపించారు. తొలి టెస్ట్‌లో కుల్దీప్ యాదవ్ ప్రభావం చూపలేకపోయాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో ఒకే ఒక్క వికెట్ తీయడంతో అతన్ని తప్పిస్తారనే ప్రచారం జోరుగా సాగింది. 33 ఏళ్ల సారాన్ష్ జైన్‌కు అవకాశం ఇస్తారనే అభిప్రాయం వ్యక్తమైంది. ఈ క్రమంలోనే వైరల్ ఫీవర్ అంటూ బీసీసీఐ చేసిన ప్రకటనపై నెటిజన్లు సందేహం వ్యక్తం చేశారు. తొలి రోజు ఆట అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న సితాన్ష్ కోటక్‌ను మీడియా ప్రతినిధులు ఈ విషయంపై ప్రశ్నించగా.. తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. ఇదేం ప్రశ్న ఇలా ఎలా ఆలోచిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశాడు. 'ఇది ఏ మాత్రం సందర్భోచితమైన ప్రశ్న కాదు. కుల్దీప్ యాదవ్‌కు గాలే నుంచి వచ్చేటప్పుడే వైరల్ ఫీవర్ సోకింది. జట్టుకు ఆఫ్-స్పిన్నర్ అవసరమైతే.. కుల్దీప్ యాదవ్ అనారోగ్యానికి గురయ్యాడని చెప్పాల్సిన అవసరం మాకు లేదు. అతను ఆడే స్థితిలో లేనప్పుడు ఒకవేళ ఫిట్‌గా ఉంటే ఏం చేసేవారని అడగడం సరికాదు. ఇలా ఆలోచించడం కూడా అన్యాయం'అని సితాన్ష్ కోటక్ ఘాటుగా బదులిచ్చాడు. రిషభ్ పంత్ గాయం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సీరియస్ ఇంజ్యూరీ కాదని సితాన్ష్ కోటక్ తెలిపాడు. అతను తిరిగి బ్యాటింగ్ చేస్తాడని చెప్పాడు. మైదానంలో యశస్వి జైస్వాల్, అసితా ఫెర్నాండో గొడవపై స్పందిస్తూ.. ఆటలో ఇవన్నీ సహజమని అభిప్రాయపడ్డాడు. బౌలర్ ఏదో అన్నాడని, కానీ యశస్వి జైస్వాల్ అలా దూసుకెళ్తాడని తాను అనుకోలేదని చెప్పాడు. కుల్దీప్ యాదవ్ గైర్హాజరీతో 33 ఏళ్ల సరాన్ష్ జైన్ అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 85 ఓవర్లలో 5 వికెట్లకు 300 పరుగులు చేసింది. దేవదత్ పడిక్కల్(193 బంతుల్లో 12 ఫోర్లతో 117) మరో శతకంతో చెలరేగగా.. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(108 బంతుల్లో 6 ఫోర్లతో 50) హాఫ్ సెంచరీతో రాణించాడు. రవీంద్ర జడేజా(43), యశస్వి జైస్వాల్(45) తృటిలో హాఫ్ సెంచరీలు చేజార్చుకున్నారు. క్రీజులో ధ్రువ్ జురెల్(7 బ్యాటింగ్)తో పాటు సరాన్ష్ జైన్(4 బ్యాటింగ్) ఉన్నాడు. శ్రీలంక బౌలర్లలో అసితా ఫెర్నాండో మూడు వికెట్లు తీయగా.. లాహిరు కుమార, కేశర నువాంత తలో వికెట్ తీసారు.

# దేవదత్ పడిక్కల్ వరుస సెంచరీలు

శ్రీలంక పర్యటనలో భారత యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ అదరగొడుతున్నాడు. ఇటీవల గాలె వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లో (167, 44) రాణించి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. తాజాగా కొలంబో టెస్టులోనూ తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ, మరో సెంచరీ నమోదు చేశాడు. అదివారం ప్రారంభమైన రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో పడిక్కల్ 117 పరుగులతో రాణించాడు. దీంతో ప్రస్తుతం అందరి కళ్లు పడిక్కల్‌పై పడ్డాయి. ఛతేశ్వర్ పుజారా తర్వాత టెస్టుల్లో భారత్‌కు నెం 3 స్థానాన్ని భర్తీ చేయడం సవాల్‌గా మారింది. టెస్టుల్లో కీలకమైన ఈ వన్‌డౌన్‌లో పలువురు బ్యాటర్లను పరీక్షించి చూసింది. అయితే గతేడాది సాయి సుదర్శన్ సుదీర్ఘ ఫార్మాట్‌లో అరంగేట్రం చేయడంతో అతడే ఆ ప్లేస్‌లో బ్యాటింగ్ చేస్తున్నాడు.



అప్పట్నుంచి నెం 3 స్థానానికి మేనేజ్‌మెంట్ కూడా సుదర్శన్ పేరునే పరిశీలిస్తుంది. ఈ లంక పర్యటనలో కూడా మొదట సుదర్శన్‌నే ఎంపిక చేసింది. అయితే అతడు గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో ఆ ఛాన్స్ పడిక్కల్‌కు వచ్చింది. అలా వచ్చిన అవకాశాన్ని పడిక్కల్ పూర్తిగా సద్వినియోగం చేసుకుంటున్నాడు. ప్రత్యర్థి బౌలర్లను సమర్థంగా ఎదుర్కొని పరుగులు సాధిస్తున్నాడు. తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో ఏకంగా 167 పరుగుల భారీ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. నంబర్ 3 స్థానంలో కొంతకాలంగా ఫాస్ట్, స్పిన్ బౌలింగ్ రెండింటినీ సమర్థవంతంగా ఎదుర్కొనే టెస్టు బ్యాటర్ కోసం మేనేజ్‌మెంట్ అన్వేషిస్తోంది. అయితే ఈ సిరీస్‌లో వరుసగా రెండు మ్యాచ్‌ల్లో సెంచరీ నమోదు చేయడంతో పడిక్కల్‌పై ప్రశంసలు కురుస్తున్నాయి. సుదర్శన్ వచ్చినా జట్టులోంచి పడిక్కల్‌ను తీసివేయొద్దంటూ ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు. తన ప్రదర్శనతోనూ పడిక్కల్ సెలక్టర్ల దృష్టిని ఆకర్షిస్తున్నాడు. నిలకడగా రాణిస్తూ పరుగులు చేస్తుండడంతో ఈ ప్లేస్‌కు పడిక్కల్ సెట్ అయిపోయినట్లే అని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుత టూర్‌లో రెండు సెంచరీలు సాధించినంత మాత్రాన పడిక్కల్‌ను అప్పుడే నెం 3 బ్యాటర్ అని కన్ఫర్మ్ అయిపోడానికి వీల్లేదు. ఎందుకంటే అతడికి అసలు పరీక్ష ఇప్పుడిప్పుడే మొదలవుతుంది. ఈ నిలకడను ఇలాగే కొనసాగిస్తేనే అతడికి వన్‌డౌన్‌లో అవకాశం ఉంటుంది. అంతేకానీ ఒకట్రెండు సిరీస్‌లకు మాత్రమే ఈ ప్రదర్శన పరిమితమైతే మాత్రం కనుమరుగైపోయే ప్రమాదం ఉంది. గతంలో ఎందరో క్రికెటర్లు వచ్చిన కొత్తలో అదరగొట్టేసి, ఆ తర్వాత తుస్సుమనిపించారు. వాళ్లంతా ఇప్పుడు కనుమరుగైపోయారు.

## దేవకన్యలా మెరిసిన మానస వారణాసి..

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ మానస వారణాసి ఫెమినా మిస్ ఇండియా 2020 విజేత గా నిలిచారు. 'దేవకీ నందన వాసుదేవ' తో ఎంట్రీ ఇచ్చిన ఈ భామ ఇప్పుడు తన ట్రెడిషనల్ గ్రేస్‌తో కుర్రకారు గుండెలను కొల్లగొడుతోంది. హైదరాబాద్‌కే చెందిన ఈ ముద్దుగుమ్మ మిస్ వరల్డ్ 2021 పోటీల్లో టాప్-13లో నిలిచి దేశం గర్వపడేలా చేసింది. రీసెంట్‌గా రిలీజైన 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాతో మంచి హిట్ కొట్టిన ఈ అందాల భామ, సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన లేటెస్ట్ ఫొటోషూట్ ప్రస్తుతం ఫ్యాన్స్‌ని మంత్రముగ్ధులను చేస్తోంది. 'బ్రీజ్' తాకిడికి రెక్కలు విప్పుకున్న అందం: మానస వారణాసి "బ్రషెడ్ బై ది బ్రయీజ్ "అంటూ ఇన్స్టాగ్రామ్‌లో పంచుకున్న పిక్స్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. లైట్‌వెయిట్, పారదర్శకమైన శారీ డ్రేప్‌లో ఆమె కనిపించిన తీరు దేవకన్యను తలపిస్తోంది. ఇక ప్లెయిన్ వైట్ స్లీవ్‌లెస్, హై-నెక్ బ్లౌజ్‌తో రూపొందించిన ఈ మోడరన్ అండ్ ట్రెడిషనల్ కాంబినేషన్ ఆమెకు ఎంతో క్లాసీ అండ్ ఫ్రెష్ లుక్‌ని ఇచ్చింది. సింపుల్ జ్యువెలరీ.. సోయగం డబుల్: ఎక్కువ హడావుడి లేకుండా మినిమల్ టచ్‌తో ఆమె చేసిన ఈ ఫొటోషూట్ అందరినీ ఆకట్టుకుంటోంది. సంప్రదాయబద్ధమైన సిల్వర్ ఝుంకాలు, చేతికి ఒక సన్నటి బ్రాస్‌లెట్ మాత్రమే ధరించి తన సహజ సౌందర్యాన్ని ప్రదర్శించింది. ఇక కామెంట్ బాక్స్‌లో నెటిజన్లు "ఏంజెల్", "అచ్చ తెలుగు అందం", "సూపర్బ్" అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తూ లైకుల సునామీ సృష్టిస్తున్నారు. 'కపుల్ ఫ్రెండ్లీ' హిట్‌తో ఫుల్ జోష్: మోడలింగ్‌లో రాణించిన మానస వారణాసి, నటనలోనూ తన మార్క్ చూపిస్తోంది. సంతోష్ శోభన్ సరసన ఆమె నటించిన రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'కపుల్ ఫ్రెండ్లీ' బాక్సాఫీస్ వద్ద మంచి హిట్ టాక్ తెచ్చుకోవడంతో ఈ భామ ఫుల్ ఖుషీగా ఉంది. ఇక అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వంలో, యూవీ కాన్సెప్ట్స్ బ్యానర్‌పై వచ్చిన ఈ సినిమాతో నటిగా మానస తన స్థానాన్ని మరింత బలంగా సుస్థిరం చేసుకుంది. అందం, అభినయంతో పాటు హుందాతనంతో కూడిన సంప్రదాయ లుక్స్‌కి కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది మానస వారణాసి. ఇక క్యూట్ అండ్ క్లాసీ ఫోజులతో కుర్రకారు మనసు దోచుకున్న ఈ తెలంగాణ బ్యూటీ, రాబోయే రోజుల్లో తెలుగు చిత్రసీమలో మరిన్ని బిగ్ ఆఫర్లతో సంచలనం సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది.





## ఓ ఇంటివాడైన టాలీవుడ్ నటుడు ప్రిన్స్..

### న్యూజిలాండ్ లో ఘనంగా వివాహం



టాలీవుడ్ యంగ్ హీరో ప్రిన్స్ సెసిల్ ఓ ఇంటివాడయ్యాడు. తన ప్రియురాలు సాయి ప్రతిమ మెడలో మూడు ముళ్లు వేసి వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టాడు. న్యూజిలాండ్‌లోని వనాకా ప్రాంతంలో అత్యంత సుందరమైన ప్రదేశంలో వీరి వివాహం హిందూ సంప్రదాయ పద్ధతిలో వైభవంగా జరిగింది. ఈ వేడుకకు ఇరు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరయ్యారు.

వివాహ వేడుకలో వధువు సాయి ప్రతిమ ఎరుపు రంగు పట్టుచీర, సంప్రదాయ ఆభరణాలతో మహారాణిలా మెరిసిపోగా, వరుడు ప్రిన్స్ ఐవరీ కలర్ ప్రింటెడ్ పైజామాలో రాజకుమారుడిలా కనిపించాడు. వీరి పెళ్లికి సంబంధించిన ఫోటోలను సోషల్ మీడియాలో పంచుకోవడంతో, అవి క్షణాల్లో వైరల్ అయ్యాయి. ఈ నూతన జంటకు పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు, నెటిజన్లు శుభాకాంక్షలు తెలుపుతూ కామెంట్లు పెడుతున్నారు.వీరిద్దరి ప్రేమకథ కూడా ఎంతో ఆసక్తికరంగా మొదలైంది. ప్రముఖ నటుడు ప్రియదర్శి ద్వారా ఒక కామన్ ఫ్రెండ్ వివాహ వేడుకలో ప్రిన్స్, సాయి ప్రతిమలకు తొలిసారి పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం స్నేహంగా, ఆపై ప్రేమగా మారి ఇప్పుడు పెళ్లి పీటల వరకు చేరింది.'నీకు నాకు డ్యాష్ డ్యాష్' చిత్రంతో హీరోగా పరిచయమైన ప్రిన్స్, 'బస్ స్టాప్' సినిమాతో యువతలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత 'బిగ్ బాస్ తెలుగు' మొదటి సీజన్‌లో పాల్గొని తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. ఇటీవల 'డీజే టిల్లు', 'స్కంద' వంటి విజయవంతమైన చిత్రాల్లో వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ నటుడిగా తనను తాను నిరూపించుకుంటున్నాడు. ప్రస్తుతం ప్రిన్స్ మరికొన్ని ప్రాజెక్టులతో బిజీగా ఉన్నాడు.

## 100 కోట్ల క్లబ్ దిశగా 'ఇరుముడి'

రవితేజ అంటే చాలు మాస్ ఆడియన్స్ ఊగిపోతారు. ఆయన సినిమాలలో యాక్షన్ ఉంటుంది .. ఎమోషన్ ఉంటుంది .. తనదైన కామెడీ ఉంటుంది. రొమాంటిక్ గా సాగిపోయే సాంగ్స్ ఉంటాయి. ఫైనల్ గా వీటన్నిటికీ మాస్ టచ్ ఉంటుంది. అయితే ఈ సారి మాత్రం ఆయన కాస్త డిఫరెంట్ గా డివోషనల్ టచ్ ఇస్తూ, 'ఇరుముడి' సినిమా చేశారు. శివ నిర్వాణ దర్శకత్వం వహించిన ఈ సినిమా, ఈ నెల 21వ తేదీన భారీ ఓపెనింగ్స్ తో తన ప్రస్థానాన్ని మొదలుపెట్టింది. తొలి రోజునే ప్రపంచవ్యాప్తంగా 24 కోట్లకు పైగా గ్రాస్ ను వసూలు చేసింది. మొదటి రోజునే హిట్ టాక్ రావడంతో, శనివారం నుంచి థియేటర్స్ పెంచవలసిన వచ్చింది. దాంతో ఈ సినిమా మరింత దూకుడు చూపిస్తూ వెళ్లింది. అలా మొదటి మూడు రోజులలో ఈ సినిమా 75 కోట్లకు పైగా గ్రాస్ ను రాబట్టింది. రెండు రోజులలోనే బ్రేక్ ఈవెన్ ను సాధించింది, రవితేజ కెరియర్లో చాలా వేగంగా ఈ స్థాయి వసూళ్లను రాబట్టిన సినిమాగా నిలిచింది. అలాగే రవితేజ కెరియర్లో యూ ఎస్ బాక్సాఫీస్ వైపు నుంచి, తొలి మిలియన్ డాలర్ మూవీగా నిలిచింది. ఇక సోమవారం రోజున కూడా ఈ సినిమా అదే జోరును కొనసాగిస్తుండటం విశేషం. 100 కోట్ల క్లబ్ లోకి ఈ సినిమా చేసే సమయం చాలా దగ్గరలోనే ఉంది. కూతురు పట్ల ఉన్న ప్రేమ .. ఆ కూతురును ఇచ్చిన అయ్యప్పస్వామి పట్ల భక్తి రవితేజ పాత్రలో ప్రధానమైన కోణాలుగా కనిపిస్తాయి. ఆడపిల్లలకు ఒక ఆశయం ఉండాలి .. వాళ్లు ధైర్యంగా పెరగాలి .. ఆదర్శంగా నిలవాలి అనే కాన్సెప్ట్ తో రూపొందిన ఈ సినిమాకి, పాటలు అదనపు బలంగా నిలిచాయి. విలేజ్ నేపథ్యంలోని హీరోయిజం .. విలేజ్ ను అడ్డాగా చేసుకుని దుర్మార్గాన్ని సాగించాలనుకున్న విలనిజం ఆవిష్కరణ ఇంట్రెస్టింగ్ గా అనిపిస్తుంది. రవితేజ కెరియర్ లో గొప్ప హిట్ గా ఈ సినిమా నిలుస్తుందని చెప్పచ్చు.



## వివాదంతో పెద్ద ప్రచారం కొట్టేసిన వర్ధమాన నటి

సినిమా ప్రమోషన్లలో వినూత్న పద్ధతులు పాటించడం ఈ రోజుల్లో సర్వసాధారణమైపోయింది. అయితే ఇటీవల కన్నప్ప, బ్లాస్ట్ చిత్రాల ద్వారా ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న వర్ధమాన నటి ప్రీతి ముకుందన్ పాల్గొన్న ఓ ప్రచార కార్యక్రమం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఓ పబ్లిక్ ఈవెంట్‌లో పాల్గొనడానికి ఆమెను గ్రాండ్‌గా రథంపై ఊరేగింపుగా తీసుకెళ్లడం పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఈ ఊరేగింపు సందర్భంగా అందాల భామను ప్రత్యక్షంగా చూసేందుకు అభిమానులు, జనం భారీ సంఖ్యలో తరలిరావడంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయింది. గంటల తరబడి వాహనాలు నిలిచిపోయి సామాన్య ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో నెటిజన్లు మండిపడ్డారు. పబ్లిసిటీ స్టంట్ల పేరుతో ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందంటూ పలువురు హితవు పలికారు ఇదే సమయంలో ప్రీతి ముకుందన్ కుటుంబ నేపథ్యం గురించి కూడా నెట్టింట ఒక ఆసక్తికరమైన ప్రచారం సాగుతోంది. భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్‌కు ఈ నటి మనవరాలు (గ్రాండ్ డాటర్) అంటూ వార్తలు వస్తున్నాయి. అయితే ఇందులో నిజం లేదని.. రామానుజన్ 1920లో తన 32వ ఏటనే సంతానం లేకుండా పరమపదించారని.. కాబట్టి ఆయనకు నేరుగా వారసులు ఎవరూ లేరని స్పష్టమవుతోంది. నెటిజన్లు అనుకుంటున్నట్లు రామానుజన్‌కు ప్రీతి ప్రత్యక్ష మనవరాలు కాకపోయినా ఆమె ఆయన కుటుంబానికి చెందిన వ్యక్తి కావడం విశేషం. ప్రీతి ముకుందన్‌కు రామానుజన్ వరుసకు ముత్తాత (గ్రేట్-గ్రాండ్ అంకుల్) అవుతారు. రామానుజన్ తమ్ముడి కుమారుడే అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన కర్నాటిక్ జాజ్ గిటారిస్ట్ గిటార్ ప్రసన్న (ప్రసన్న రామస్వామి) .. ఆయన సోదరి డాక్టర్ దీపా ముకుందన్. ఈ డాక్టర్ దీపా ముకుందన్ మరెవరో కాదు, హీరోయిన్ ప్రీతి ముకుందన్ తల్లే.



## నన్ను హీరోగా వద్దన్నారు..

### అయినా నా డైరెక్టర్ వినలేదు: అర్జున్ దాస్

అర్జున్ దాస్, అదితి శంకర్ జంటగా ఆగస్ట్ 28న సినిమా విడుదల

దక్షిణాదిలో వేగంగా ఎదుగుతున్న నటుడు అర్జున్ దాస్, తన కొత్త సినిమాకు సంబంధించి ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకుంటూ భావోద్వేగానికి గురయ్యాడు. అదితి శంకర్‌తో కలిసి ఆయన హీరోగా నటించిన తమిళ రొమాంటిక్ డ్రామా 'ఒన్స్ మోర్'. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో మాట్లాడిన అర్జున్ దాస్, దర్శకుడు విఘ్నేశ్ శ్రీకాంత్ తనపై ఉంచిన నమ్మకాన్ని గుర్తుచేసుకున్నాడు. హీరోగా తనను తొలగిస్తే సినిమా నిర్మిస్తామని పలు నిర్మాణ సంస్థలు ముందుకు వచ్చినా, దర్శకుడు మాత్రం తన కోసమే నిలబడ్డారని వెల్లడించాడు.ఈ సందర్భంగా అర్జున్ దాస్ మాట్లాడుతూ, "చాలా కాలం క్రితం దర్శకుడు శ్రీకాంత్ ఈ కథతో నా దగ్గరకు వచ్చాడు. మా కామన్ ఫ్రెండ్, డైరెక్టర్ సూర్య నారాయణ్ మా ఇద్దరినీ పరిచయం చేశారు. శ్రీకాంత్ చెప్పిన లైన్ నాకు చాలా అందంగా అనిపించింది" అని తెలిపాడు. అయితే, ఈ ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళ్లే క్రమంలో ఎదురైన సవాళ్లను దాస్ వివరించాడు."ఈ కథను చాలా నిర్మాణ సంస్థలకు శ్రీకాంత్ వినిపించాడు. కానీ వాళ్లలో చాలామంది 'హీరోని మార్చితే సినిమా చేస్తాం' అని చెప్పారు. కానీ అన్ని నిర్మాణ సంస్థలకూ శ్రీకాంత్ ఒకటే చెప్పాడు.. 'లేదు, నేను ఈ సినిమా అర్జున్ దాస్‌తోనే చేస్తాను' అని అతడు గట్టిగా చెప్పినట్లు" అర్జున్ దాస్ వెల్లడించాడు. ఎంతో కాలం ఎదురుచూసిన తర్వాత, దర్శకుడి ఆలోచనలతో ఏకీభవించిన నిర్మాత యువరాజ్ గణేశన్ ముందుకు రావడంతో ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కిందని వివరించాడు.ఈ 'ఒన్స్ మోర్' చిత్రం ఈ ఏడాది ఆగస్ట్ 28న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. అర్జున్ దాస్, అదితి శంకర్ ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, మోడల్ సోనా ఓలికల్ ఒక కీలక పాత్రలో కనిపించనుంది. మలయాళంలో 'హృదయం', తెలుగులో 'హాయ్ నాన్న' వంటి చిత్రాలతో సంచలనం సృష్టించిన హేషమ్ అబ్దుల్ వహాబ్ ఈ సినిమాతో తమిళ చిత్ర పరిశ్రమకు సంగీత దర్శకుడిగా పరిచయం అవుతున్నారు.



## 'శుక్రాచార్యుడి యుద్ధరావం'.. ప్రశాంత్ వర్మ 'మహాకాళి' నుంచి అక్షయ్ ఖన్నా ఫస్ట్ గ్లింప్స్

ప్రశాంత్ వర్మ క్రియేటర్‌గా, పూజ కొల్లూరు దర్శకత్వంలో నిర్మాణం బ్లాక్‌బస్టర్ చిత్రం 'హనుమాన్'తో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన క్రియేటివ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ, తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి మరో భారీ చిత్రాన్ని అందిస్తున్నారు. 'మహాకాళి' అనే టైటిల్‌తో రానున్న ఈ చిత్రం నుంచి 'శుక్రాచార్యుడి యుద్ధరావం' పేరుతో ఫస్ట్ గ్లింప్స్‌ను సోమవారం విడుదల చేశారు. ఇందులో రాక్షసుల గురువు శుక్రాచార్యుడి పాత్రలో ప్రముఖ బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా నటిస్తున్నారు.

తాజాగా విడుదల చేసిన ఈ గ్లింప్స్, సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. »THE END BEGINS» (అంతం మొదలవుతుంది) అనే ట్యాగ్‌లైన్‌తో, గంభీరమైన వాతావరణంలో అక్షయ్ ఖన్నా లుక్, డైలాగ్ డెలివరీ ఆకట్టుకుంటున్నాయి. హనుమాన్ ప్రపంచానికి కొనసాగింపుగా వస్తున్న ఈ చిత్రంలో అసుర గురువు శుక్రాచార్యుడి పాత్ర ఎంత కీలకంగా ఉండబోతోందో ఈ గ్లింప్స్ స్పష్టం చేస్తోంది. ప్రశాంత్ వర్మ మార్క్ విజువల్స్, సౌండ్ డిజైన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.ఈ చిత్రానికి ప్రశాంత్ వర్మ కథ, కాన్సెప్ట్ అందిస్తూ క్రియేటర్‌గా వ్యవహరించగా, పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. ఆర్‌కేడీ స్టూడియోస్ పతాకంపై రివాజ్ రమేష్ దుగ్గల్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భూమి శెట్టి లీడ్ రోల్ పోషిస్తున్న ఈ చిత్రంలో అక్షయ్ ఖన్నాతో పాటు శ్రియా రెడ్డి, రోహిత్ సరాఫ్, సముద్రఖని, నాజర్, మురళీ శర్మ, రజత్ కపూర్ వంటి భారీ తారాగణం నటిస్తోంది. స్మరణ్ సాయి సంగీతం అందిస్తున్నారు.

ఈ చిత్రాన్ని 2027 జనవరి 8న సంక్రాంతి కానుకగా తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో పాన్-ఇండియా స్థాయిలో విడుదల చేయనున్నట్లు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. 'హనుమాన్' విజయం తర్వాత పీవీసీయూ నుంచి వస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613